# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

శనివారం, హైదరాబాద్ 18.01.2025 | 24 క్యారెట్లు 88,678.00 | కిలో వెండి 99,345.00 | 30°C | సంపుటి:3 సంచిక:87

www.vishalabharati.com


# త్వరలో మద్యం ధరల పెంపు..!

## మందుబాబులకు షాకివ్వనున్న సర్కార్

- బీరుపై రూ.20, క్వార్టర్‌పై రూ.20 పెరిగే ఛాన్స్
- గత నాలుగేళ్లుగా పెరగని ధరలు
- సర్కారుపై లిక్కర్ కంపెనీల ఒత్తిడి
- ఇటీవల కీలక ప్రకటన చేసిన కేఎఫ్‌బీర్ల కంపెనీ
- ధరల పెంపుతో పాటు అందుబాటులోకి కొత్త బీర్లు
- గతంలోనే కమిటీ వేసిన ప్రభుత్వం
- కమిటీ నివేదిక ఆధారంగానే ధరల పెంపు

**శాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణలో మద్యం ప్రియులకు ప్రభుత్వం షాక్ ఇవ్వనుంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది దాటిపోయింది. అయితే గత 4 ఏళ్లుగా రాష్ట్రంలో మద్యం ధరలు పెంచకుండా స్థిరంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే సదరు మద్యం కంపెనీలు.. మద్యం ధరలు పెంచాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తున్నాయి. దీంతో రాష్ట్రంలో మద్యం ధరలు పెంచాల్సిన అవసరం ఏర్పడినట్లు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. అయితే మద్యం ధరల పెంపుపై రేవంత్ రెడ్డి సర్కార్ కీలక కసరత్తులు చేస్తోంది. ఏ విధంగా మద్యం ధరలు పెంచాలి అనే దానిపై సమాలోచనలు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే 6 నెలల క్రితం ఏర్పాటు చేసిన హైకోర్టు మాజీ న్యాయమూర్తి కమిటీ ఇచ్చిన నివేదికను పరిశీలించి.. మద్యం ధరల పెంపుపై ఒక నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

రాష్ట్రంలో చివరిసారిగా గతంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మద్యం ధరలు పెంచారు. గడిచిన 4 ఏళ్లుగా రాష్ట్రంలో మద్యం ధరలు పెంచలేదని ఇటీవల యునైటెడ్ బేవరేజస్ కంపెనీ లిమిటెడ్.. తెలంగాణ ప్రభుత్వానికి ఒక లేఖ రాసింది. మద్యం ధరలను పెంచడంతో పాటు.. మద్యం విక్రయాలపై తమకు ఇచ్చే మార్జిన్‌ను కూడా పెంచాలని ఆ సంస్థ సర్కారుకు రాసిన లేఖలో స్పష్టం చేసింది. అయితే మద్యం ధరలు పెంచాలని.. మద్యం కంపెనీల నుంచి వస్తున్న విజ్ఞప్తుల నేపథ్యంలో.. తెలంగాణ ప్రభుత్వం హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఆధ్వర్యంలో

..మిగతా 2 లో



# పెట్టుబడులు షురూ..



## సింగపూర్ ఐటీఈతో స్కిల్ యూనివర్సిటీ ఒప్పందం

- యువత నైపుణ్య శిక్షణకు సహకారం
- సీఎం పర్యటనలో తొలిరోజే కుదిరిన ఒప్పందం
- ఫలవంతమైన చర్చలతో మొదటిరోజు ప్రారంభం
- ఎక్స్ వేదికగా సీఎం రేవంత్‌ట్వీట్
- ఈ నెల 20 వరకు సింగపూర్‌లోనే ముఖ్యమంత్రి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** సింగపూర్ లో రాష్ట్ర బృందం మూడు రోజుల పర్యటన శుక్రవారం ప్రారంభమైంది. గురువారం రాత్రి 10 గంటలకు ఢిల్లీ విమానాశ్రయం నుంచి సీఎం రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఉన్నతాధికారుల బృందం శుక్రవారం ఉదయం సింగపూర్‌కు చేరుకుంది. సింగపూర్‌లోని ఛాంగీ విమానాశ్రయంలో సీఎం, మంత్రి, ఉన్నతాధికారులకు అక్కడి తెలుగు ప్రజలు స్వాగతం పలికారు. సింగపూర్ పర్యటన విజయవంతం

..మిగతా 2 లో



## ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్

- జనవరి 31 నుంచి ఫిబ్రవరి 13 వరకు పార్లమెంట్
- ఖరారైన సమావేశ తేదీలు
- సామాన్యులు, వేతన జీవుల్లో గంపెడాశలు

2 లో

# అర్హులందరికీ కొత్త కార్డులు ఇస్తాం

- పాత రేషన్ కార్డులు తొలగించం
- తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు
- జనవరి 26 నుంచి కొత్త కార్డుల పంపిణీ
- మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక వ్యాఖ్యలు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** జనవరి 26 నుండి కొత్త రేషన్ కార్డులు ఇచ్చే ప్రక్రియ కోసం గ్రామాల్లో సర్వే జరుగుతుందని రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. 2 కోట్ల 81 లక్షల మందికి ఇప్పటికే తెలంగాణలో 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని, పాత రేషన్ కార్డులు తొలగించడం లేదని స్పష్టం చేశారు. అర్హత ఉండి

..మిగతా 2 లో



## దీప్తి జివాంజికి అర్జున అవార్డు

- మరో తెలుగమ్మాయి జ్యోతికి కూడా
- మను, హర్మన్, గుకేశ్, ప్రవీణ్‌కు ఖేల్ రత్న
- రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కారాల ప్రదానం

..మిగతా 2 లో



## గ్రామసభల్లో ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితా

- స్థలం ఉన్నవారికే మొదటి విడతలోనే
- త్వరలో వీఆర్వో నియామక పరీక్షలు
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

..మిగతా 2 లో



## మున్సిపాలిటీల్లో స్పెషల్ ఆఫీసర్ల పాలన

- జనవరి 26తో ముగియనున్న పాలకమండళ్ల గడువు
- ఇప్పట్లో ఎన్నికలు కష్టమే అంటున్న విశ్లేషకులు
- మున్సిపాలిటీ ప్రత్యేక అధికారులుగా ఆర్డీవోలు
- కార్పొరేషన్ల బాధ్యతలు కలెక్టర్లకు
- త్వరలో ఆదేశాలు జారీ చేయనున్న రాష్ట్ర ప్రభుత్వం

2 లో

# 10 నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు



- పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పక్కా
- రుణమాఫీ 100 శాతం పూర్తికాలే
- అలా అని నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటా
- మా ఎమ్మెల్యేలంతా మూకుమ్మడిగా రాజీనామా చేస్తాం
- 6 గ్యారెంటీల్లో.. అర గ్యారంటీనే అమలు
- చేవెళ్ల రైతు ధర్నాలో కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు
- రైతు భరోసా ఎకరానికి రూ.15వేలు ఇవ్వాలని డిమాండ్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణలో మరోసారి ఎన్నికల వార్తలు ఆసక్తికరంగా మారుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికలు ముగిసి ఏడాది దాటగా.. లోక్‌సభ ఎన్నికలకు దాదాపు 9 నెలలు దాటాయి. ఈ క్రమంలో మరో ఎన్నిక రాబోతున్నదనే వార్త కలకలం రేపుతున్నది. తాజాగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ఆసక్తికరంగా మారాయి. త్వరలోనే ఎన్నికలు రానున్నాయని పూర్తి విశ్వాసంతో కేటీఆర్ ప్రకటించడం కాక రేపుతున్నది. కేటీఆర్ స్పష్టంగా చెప్పడం చూస్తుంటే ఉప ఎన్నికలు రాక

..మిగతా 3 లో


## ర్యాపిడో, ఓలా, ఊబర్ ద్వారా

# డ్రగ్ సరఫరా..

### సైనిక్‌పురిలో ఇద్దరు నిందితుల అరెస్ట్

- 190 గ్రాముల హెరాయిన్ స్వాధీనం
- గ్యాస్ సిలిండర్ వాల్వ్‌లలో ప్యాక్ చేసి సప్లై
- వీటి విలువ రూ.23 లక్షలు ఉంటుందని అంచనా

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు నేతృత్వంలో డ్రగ్ మాఫియాపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. సైనిక్‌పురిలో గ్యాస్ వ్యాపారం ముసుగులో హెరాయిన్ డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఓ ముఠాను పోలీసులు




..మిగతా 2 లో

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శనివారం,
18.01.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## బట్టలు కొనిస్తానని.. బాలికపై అత్యాచారయత్నం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** సంక్రాంతి పండుగ సందర్భంగా కొత్త దుస్తులు కొనిస్తానని వరసకు కూతురయ్యే బాలిక ను తీసుకెళ్లి ఓ కామాంధుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.... ఇబ్రహీంపట్నం మండలంలోని ఓ గ్రామానికి చెందిన గడ్డం ఆంజనేయులు (31) అనే వ్యక్తి తుర్కయంజాల్ లో నివాసం ఉంటూ, మంగలి పని చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. అతని సొంత అన్న కూతురు (14) యాచారంలో 9వ తరగతి చదువుతోంది. గురువారం సాయంత్రం స్వగ్రామానికి వెళ్లిన ఆంజనేయులు మైనర్ బాలికకు కొత్త బట్టలు కొనిస్తానని తుర్కయంజాల్ కు తీసుకెళ్లి, ఆ తర్వాత సాయంత్రం 7:30 గంటల ప్రాంతంలో ఓ హోటల్ లోని ఓయో రూంకు తీసుకెళ్లి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాలిక ప్రతిఘటించి తప్పించుకొని భయంతో బయటకు వచ్చి కేకలు వేస్తూ రోడ్డు పక్కన వారికి విషయం చెప్పగా వారు 100 ఫోన్ చేసి చెప్పారు. ఆంజనేయులు పారిపోయే ప్రయత్నం చేయగా.... పోలీసులు అతన్ని పట్టుకున్నారు. తల్లిదండ్రులు ఆదిభట్ల పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా, ఆంజనేయులు పై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇది ఇలా ఉండగా నిందితుడు ఆంజనేయులుకు వివాహం అయ్యి ఇద్దరు పిల్లలు ఉన్నారు.



## పెట్టుబడులు షురూ..

తరువాయి భాగం

కావాలని ఆకాంక్షిస్తూ ముఖ్యమంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సింగపూర్ విదేశాంగ శాఖ మంత్రి వివియన్ బాలకృష్ణన్‌తో రాష్ట్ర ప్రతినిధి బృందం సమావేశమైంది. వివిధ రంగాల్లో సింగపూర్‌తో దీర్ఘకాలిక సంబంధాలపై వివియన్ బాలకృష్ణన్, రేవంత్ రెడ్డి చర్చించారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి, విద్యుత్, గ్రీన్ ఎనర్జీ, నీటి నిర్వహణ, మూసీ పునరుజ్జీవనం, విద్య, స్కిల్ డెవలప్‌మెంట్, ఐటీ తదితర రంగాలపై ఇద్దరు నేతలు చర్చించారు. ఛాంగీ నగరంలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ITE)ని సీఎం బృందం సందర్శించింది.

**స్కిల్ యూనివర్సిటీ ఎంవోయూ**

అక్కడ శిక్షణ ఇస్తున్న తీరు, కోర్సులు, సదుపాయాలను పరిశీలించారు. అనంతరం సింగపూర్ ఐటీఈతో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఎంవోయూ కుదుర్చుకుంది. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు, ప్రత్యేక సీఎస్ జయేష్ రంజన్ సమక్షంలో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ వీసీ సుబ్బారావు, ఐటీఈ డిప్యూటీ డైరెక్టర్ ఫాబియన్ చియాంగ్ ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. సింగపూర్ ఐటీఈ పార్శ్యాంశాలను ఉపయోగించుకోవడంతో పాటు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ట్రైయినర్లకు శిక్షణ ఇచ్చేలా ఒప్పందం జరిగింది. సింగపూర్ ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఐటీఈ పదో తరగతి విద్యార్థుల నుంచి అన్ని వయసుల వారికి జాబ్ రెడీ శిక్షణ ఇస్తోంది. స్కిల్స్ ఫర్ ఫూచర్, స్కిల్స్ ఫర్ లైఫ్ అనే నినాదంతో వంద కోర్సులకు ఆన్‌లైన్, క్యాంపస్ శిక్షణ ఇస్తున్న ఐటీఈలో ప్రస్తుతం 28 వేల మంది శిక్షణ పొందుతున్నారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి సహకరించాలని సింగపూర్ ఐటీఈని సీఎం కోరారు. ఈనెల 19 వరకు సింగపూర్‌లోనే రాష్ట్ర బృందం పర్యటించనుంది. ఈనెల 20 నుంచి దావోస్ లో ప్రపంచ ఆర్థిక ఫోరం సదస్సులో పాల్గొంటారు. రెండు దేశాల పర్యటన సింగపూర్ విదేశాంగ మంత్రితో ఫలవంతమైన చర్చలతో ప్రారంభమైందని సీఎం రేవంత్ రెడ్డి ఎక్స్‌లో ట్వీట్ చేశారు.







## పలు అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపు

- విలీన గ్రామాలకు రోడ్ల నిర్మాణం
- రోడ్ల నిర్మాణానికి రూ.1 కోటి మంజూరు
- పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ జనరల్ బాడీ సమావేశంలో కీలక నిర్ణయాలు
- ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

విశాలభారతి, పెద్ద అంబర్‌పేట్:

పలు అభి వృద్ధి పనులకు నిధులు కేటాయిస్తూ పెద్ద అంబర్‌పేట్ మున్సిపల్ పాలకవర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. శుక్రవారం నాడు మున్సిపాలిటీ జనరల్ బాడీ మీటింగ్ జరిగింది. ఈ సమావేశానికి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి, చైర్‌పర్సన్ పండుగల జయశ్రీరాజు, వైస్ చైర్ పర్సన్ చామ సంపూర్ణ విజయశేఖర్ రెడ్డి, స్థానిక కౌన్సిలర్లు, డీఈ, ఏఈ, ఇరిగేషన్ అధికారులు, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పలు అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. ప్రతి వార్డుకు, ఇటీవల మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాలకు కోటి రూపాయల నిధులను కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. అలాగే అంబర్‌పేట్ నుంచి పసుమాములకు ట్రంక్ లైన్ ఏర్పాటుకు రూ.6 కోట్లు, తట్టి అన్నారంకు ట్రంక్ లైన్ నిర్మాణానికి రూ.10 కోట్ల కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. వీటితో పాటు మున్సిపాలిటీలోని పలు అభివృద్ధి అంశాలపై చర్చ జరిగింది.

## త్వరలో మద్యం ధరల పెంపు..!

తరువాయి భాగం

ఐదుగురు సభ్యుల కమిటీని 6 నెలల క్రితమే ఏర్పాటు చేసింది. ఈ కమిటీ తొలిసారి జూలై 18వ తేదీన సమావేశమైంది. జులై 25వ తేదీ లోగా కంపెనీలు మద్యం సరఫరా కోసం ధరలు కోట్ చేయాలని సర్క్యులర్ జారీ చేసింది. ఆ తర్వాతి రోజే సీల్డ్ కవర్లు తెరిచి కంపెనీలు కోట్ చేసిన ధరలను కమిటీ చూసింది. మద్యం సరఫరాకు 91 కంపెనీలు ముందుకు వచ్చాయని.. బీరు, బ్రాండీ, విస్కీ, రమ్, వైన్, ఫారిన్ లిక్కర్ సహా మొత్తం 1032 బ్రాండ్లకు ధర కోట్ చేశాయని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. వీటిలో అత్యంత ప్రజాదరణ కలిగిన బీర్ల కంపెనీతో పాటు సోమ్ డిస్టిలరీ, కర్ణాటక, గోవా, మహారాష్ట కంపెనీలు, హైదరాబాద్ కంపెనీలు కూడా ఉన్నాయి.అయితే మద్యం మార్కెట్‌లో దాదాపు 60 శాతం వాటా ఉన్న యూబీ బీర్ల కంపెనీ.. తమకు ప్రస్తుతం చెల్లిస్తున్న బేసిక్ ధర మీద కనీసం 33 శాతం అదనంగా చెల్లించాలని కోట్ చేసింది. ఇక డిమాండ్‌ను ఇతర కంపెనీలు చేస్తున్నాయి. అయితే 2023లోనే బేసిక్ ధర పెంచాలని మద్యం కంపెనీలు కోరగా అప్పటి ప్రభుత్వం తిరస్కరించింది. ఇప్పటికే మద్యం ధరల పెంపునకు సంబంధించి రూ.10 నుంచి రూ.20 వరకు పెంచే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో బీర్ల ధరలు తక్కువగా ఉన్న నేపథ్యంలో.. వాటి ధరలు పెంచాలని ప్రభుత్వానికి ఎక్సైజ్ అధికారులు ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం.ఇక రాష్ట్రంలో ప్రముఖ కంపెనీల బీర్ల కొరత ఉన్నట్లు మద్యం షాపు యజమానులు చెబుతున్నారు. అయితే కింగ్ ఫిషర్ బీర్ల కొరతను అధిగమించేలా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ భావిస్తోంది. ఇందుకోసం మిగతా 5 బీర్ల కంపెనీలతో ఎప్పటికప్పుడు చర్చలు జరుపుతోంది. ఈ నేపథ్యంలోనే యునైటెడ్ బ్రేవరేస్ లిమిటెడ్ ఉత్పత్తి చేసే కింగ్‌ఫిషర్, కింగ్‌ఫిషర్ స్ట్రాంగ్, కింగ్‌ఫిషర్ అల్ట్రా, కింగ్‌ఫిషర్ అల్ట్రా మ్యాక్స్‌లు మినహా.. మిగతా బీర్లను మద్యం డిపోల్లో అందుబాటులో ఉంచాలని ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు బ్రేవరేజెస్ ఆదేశాలు జారీ చేశారు.

## మున్సిపాలిటీల్లో స్పెషల్ ఆఫీసర్ల పాలన

- జనవరి 26తో ముగియనున్న పాలకమండళ్ల గడువు
- ఇప్పట్లో ఎన్నికలు కష్టమే అంటున్న విశ్లేషకులు
- మున్సిపాలిటీ ప్రత్యేక అధికారులుగా ఆర్డీవోలు
- కార్పొరేషన్ల బాధ్యతలు కలెక్టర్లకు
- త్వరలో ఆదేశాలు జారీ చేయనున్న రాష్ట్ర ప్రభుత్వం

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

రాష్ట్రంలోని 128 మున్సిపాలిటీ పాలకమండళ్ల గడువు ఈ నెల 26తో ముగుస్తుంది. ఆ మరుసటిరోజు నుంచే స్పెషల్ అధికారు ల పాలన అమల్లోకి రానున్నది. ప్రస్తుత పాలక మండళ్ల గడువు ముగిసేలోగానే ఎన్నిక లు పూర్తిచేయాలి. కానీ ప్రభుత్వ ఇప్పట్లో ఎన్నికలు నిర్వహించే పరిస్థితులు లేవు. దీంతో పురపాలన అస్తవ్యస్తమవుతుందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. నిరుడే గడువు ముగిసిన పంచాయతీలలోనే ఇంతవరకు ఎన్నికలు ని ర్వహించలేదు. పంచాయతీ ఎన్నికలతోపాటు మున్సిపల్ ఎన్నికలు నిర్వహించే పరిస్థితులు తక్కువగానే ఉన్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అంతకు ముందే బీసీలకు 42% రిజర్వేషన్ లెక్క తేలాలి. ప్రభుత్వం ఇప్పటికే డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటుచేసింది. ఆ కమిటీ నివేదికను అనుసరించి మున్సిపాలిటీ ల ఎన్నికల నిర్వహణ ఆధారపడి ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరో 10 రోజుల్లో మున్సిపల్ పాలక మండళ్ల గడువు ముగియనున్న నేపథ్యంలో మూలకు పడిన పనులకు మోక్షం కల్పించారు. ఆ పనులను శరవేగంగా పూర్తిచేస్తున్నారు. ఆగమేఘాల పైన రాత్రికి రాత్రే పనులు చేపడుతున్నారు. మున్సిపల్ ఎన్నికల ముందే పనులన్నింటినీ ఒకేసారి పూర్తిచేసే హడావుడి నెలకొన్నది.

**త్వరలో ప్రత్యేక అధికారుల నియామకం**

మున్సిపాలిటీలకు ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహించే పరిస్థితులు లేకపోవడంతో వాటిని అధికారుల చేతుల్లో పెట్టేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. మున్సిపాలిటీలకు ఆర్డీవోలు, మున్సిపల్ కార్పొరేషన్లకు కలెక్టర్లు స్పెషల్ ఆఫీసర్లుగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఇందుకు సంబంధించి మున్సిపల్ శాఖ ప్రాథమిక కసరత్తు పూర్తిచేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలో ఉన్నారు. ఆయన తిరిగి రాగానే దీనిపై కీలక నిర్ణయం తీసుకోనున్నారు. ఇప్పటికే అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేస్తున్నారు. సీఎం రాగానే అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది.



## ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్

- జనవరి 31 నుంచి ఫిబ్రవరి 13 వరకు పార్లమెంట్
- ఖరారైన సమావేశ తేదీలు
- సామాన్యులు, వేతన జీవుల్లో గంపెడాశలు

విశాలభారతి, నేషనల్ బ్యూరో:

పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ఈనెల 31 నుంచి జరిగే అవకాశముంది. తొలిరోజున పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగిస్తారు. రెండు విడతలు జరిగే ఈ సమావేశాలు తొలుత జనవరి 31 నుంచి ఫిబ్రవరి 13 వరకు జరగనున్నాయి. ఫిబ్రవరి 1న 202526 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను కేంద్రం పార్లమెంటులో ప్రవేశపెట్టనుంది. మార్చి 10 నుంచి ఏప్రిల్ 4 వరకు రెండో విడత సమావేశాలు జరగనున్నాయి. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కారణంగా ఫిబ్రవరి 5న పార్లమెంటు కార్యకలాపాలకు సెలవు ఇవ్వనున్నారు. బడ్జెట్ తేదీ దగ్గరపడుతున్న కొద్దీ సామాన్యుల్లో, వేతన జీవుల్లో అంచనాలు భారీగా పెరుగుతున్నాయి. అందుకనుగుణంగా ఈసారి పన్ను చెల్లింపుదారులకు ఊరటనివ్వాలని కేంద్రం భావిస్తున్నట్లు సమాచారం. ఇలా చేయడం వల్ల సామాన్యుల కొనుగోలు శక్తి పెరిగి, వృద్ధికి ఊతం లభిస్తుందని ప్రభుత్వం యోచిస్తోంది. ఫలితంగా ప్రత్యక్ష పన్నులు, జీఎస్టీ వసూళ్లు పెరిగి, ఖజానాకు పెద్ద మొత్తంలో రాబడి వస్తుందని ఆశిస్తోందని తెలుస్తోంది.



## దీప్తి జివాంజికి అర్జున అవార్డు

విశాలభారతి, నేషనల్ బ్యూరో:

క్రీడల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చినందుకుగాను అందించే ప్రముఖ అవార్డులను శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము క్రీడాకారులకు అందించారు. ప్రతిష్టాత్మక మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న అవార్డుతో పాటు ద్రోణాచార్య, అర్జున అవార్డులను విశేష ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు అందజేశారు. రాష్ట్రపతి భవన్ లో జరిగిన ఈ కార్యక్రమంలో.. ప్రవాసాంధ్రుడు, చెస్ ప్లేయర్ దొమ్మరాజు గుకేశ్, , పారా అథ్లెట్ ప్రవీణ్ కుమార్, భారత పురుషుల జట్టు హాకీ కెప్టెన్ హర్మన్ ప్రీత్ సింగ్, పారిస్ ఒలింపిక్స్ డబుల్ మెడల్ షూటర్ మానూ భాకర్ లకు మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న అవార్డులను ప్రదానం చేశారు. తెలుగు ప్లేయర్లలో అథ్లెటిక్స్ కు చెందిన పారా అథ్లెట్ జివాంజీ దీప్తి, అథ్లెట్ జ్యోతి యర్రాజీలకు అవార్డులు దక్కాయి. వీరితోపాటు మరో 32 మంది అర్జున, ఐదుగురికి ద్రోణాచార్య అవార్డులు అందుకున్నారు. లైఫ్ టైం విభాగంలో మురళీధరన్ (బ్యాడ్మింటన్), అర్మాండ్ ఆగ్నెలో కొలాకో (ఫుట్బాల్)లకు పురస్కారాలు దక్కాయి.

## అర్హులందరికీ కొత్త కార్డులు ఇస్తాం

తరువాయి భాగం

కొత్త రేషన్ కార్డులు రాని వారికి జనవరి 26 నుండి కొత్త కార్డులు ప్రభుత్వం ఇస్తుందని, ప్రతిపక్షాలు కావాలని రాజకీయం చేసి రాద్ధాంతం చేస్తున్నాయని మండిపడ్డారు. రేషన్ కార్డు అర్హత ఉండి రాకుంటే.. సంబంధిత అధికారికి, ప్రజా ప్రతినిధులకు విజ్ఞాపన పత్రాలు ఇవ్వచ్చని మంత్రి పొన్నం చెప్పారు.కరీంనగర్ జిల్లా చిగురు మామిడి మండలం ఇందుర్తి మండలంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ... 'జనవరి 26 నుండి కొత్త రేషన్ కార్డులు ఇచ్చే ప్రక్రియ కోసం గ్రామాల్లో సర్వే జరుగుతుంది. తెలంగాణ ప్రజలకు కొన్ని అంశాలు చెప్పే ప్రయత్నం చేస్తున్నా. 2 కోట్ల 81 లక్షల మందికి ఇప్పటికే తెలంగాణలో 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. ఇప్పుడు పాత 90 లక్షల రేషన్ కార్డులు చర్చ కాదు. గత 10 సంవత్సరాలుగా రేషన్ కార్డులు లేకుండా, కొత్తగా పెళ్లి అయిన వారికి, కొత్త కుటుంబాలు, మార్పులు చేర్పులు, అర్హత ఉండి కొత్త రేషన్ కార్డులు రాని వారికి శుభవార్త చెబుతున్నా. అర్హత ఉన్న వారికి జనవరి 26 నుండి రేషన్ కార్డులు ఈ ప్రభుత్వం ఇస్తుంది. ప్రతిపక్షాలు కావాలని రాజకీయం చేసి రాద్ధాంతం చేస్తున్నాయి. రేషన్ కార్డు అర్హత ఉండి రాకుంటే సంబంధిత అధికారి, ప్రజా ప్రతినిధులకు విజ్ఞాపన పత్రాలు ఇవ్వచ్చు' అని తెలిపారు. 'పాత రేషన్ కార్డులు తొలగించడం లేదు. ఇందులో ఎలాంటి కన్ఫ్యూజన్ లేదు. ఎవరైనా తప్పుడు ప్రచారం చేస్తే నమ్మవద్దు. కుల సర్వే ఆధారంగా అప్లికేషన్ల సమాచారంతో కొత్త రేషన్ కార్డులు వస్తున్నాయి. ఇందుర్తిలో 71 కొత్త రేషన్ కార్డులు వచ్చాయి. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు వస్తున్నాయి. 2 లక్షల లోపు రైతు రుణమాఫీ చేశాం. రైతు భరోసా 12 వేలు ఇస్తున్నాం. వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా ఇస్తున్నాం. భూమి లేని రైతు కూలీలకు 12 వేలు ఇస్తున్నాం. ఇందుర్తి మండల ప్రతిపాదనలు పంపాం. రాష్ట్రంలో కొత్త మండలాలు ఏర్పడినప్పుడు ఇందుర్తి మండలం ఏర్పడుతుంది' అని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు.

## ర్యాపిడో, ఓలా, ఊబర్ ద్వారా డ్రగ్ సరఫరా..

తరువాయి భాగం

అరెస్ట్ చేశారు. నేరేడ్‌మెట్ పీఎస్ పరిధిలో ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితులను అదుపులోకి తీసుకుని 190 గ్రాముల హెరాయిన్, బైక్, మొబైల్స్ సహా ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ రూ. 23 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. గ్యాస్ స్టవ్ విడిభాగాల ముసుగులో ఈ ముఠా హెరాయిన్‌ను సరఫరా చేస్తుండగా.. కస్టమర్లకు ర్యాపిడో, ఓలా, ఊబర్ వంటి రవాణా సేవల ద్వారా డ్రగ్స్ అందజేస్తున్నారని విచారణలో వెల్లడైందని కమిషనర్ సుధీర్ బాబు తెలిపారు. ఈ ముఠా చాలా కాలంగా డ్రగ్స్ సరఫరా చేస్తోందని ఆయన తెలిపారు. స్టూడెంట్స్‌ను టార్గెట్ చేస్తూ, ముందుగా వారికి డ్రగ్స్ పట్ల ఆసక్తి కలిగించడంతో మొదలు పెట్టి తరువాత డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు నిర్ధారించారు. ఇకపోతే గత ఏడాది నుండి ఇప్పటివరకు రాచకొండ పోలీసులు రూ. 88 కోట్ల విలువైన మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో 2437 కిలోల గంజాయి, 277 గ్రాముల ఎండీఎంఏ, 23 గ్రాముల హెరాయిన్, 96 కిలోల పాపిస్ట్రా, 27 కిలోల హాషిష్ ఆయిల్, 4 కిలోల ఓపియం సీజ్ చేశామని సుధీర్ బాబు తెలిపారు. డ్రగ్ పెడ్లర్లను పట్టుకోవడం వల్ల కొత్త కొత్త రూట్ల ద్వారా డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు అధికారులు. దీనిని అడ్డుకోవడంలో భాగంగా ఓలా, ఊబర్ వంటి సంస్థలతో ప్రత్యేక మీటింగ్‌లు నిర్వహించనున్నామని సీపీ తెలిపారు. డ్రగ్స్ రవాణా చేస్తున్న వ్యక్తులకు తెలియకుండా.. రైడర్ల ద్వారానే సరఫరా జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. ఇక రాచకొండ పోలీసులు నిన్నటి కాల్పుల ఘటనకు సంబంధించి నిందితుల కోసం కూడా గాలిస్తున్నారు. ఈ డ్రగ్ ముఠాలపై మరింత కఠిన చర్యలు తీసుకోవడానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేశారు అధికారులు. పోలీసుల ప్రయత్నాలతో డ్రగ్ మాఫియాకు చెక్ పెడుతూ, నగరంలో శాంతి భద్రతలను పటిష్ఠంగా నిలబెట్టేందుకు కృషి జరుగుతోంది.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శనివారం,
18.01.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత



బాల్కొండ, విశాల భారతి

అక్రమంగా తరలిస్తున ఇసుక ట్రాక్టర్ ను భీమ్‌గల్ ఎస్సై మహేష్ పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు.ఎస్సై మహేష్ తెలిపిన వివరాలు...గురువారం రాత్రి భీమ్‌గల్ పట్టణంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఇసుక లోడ్ తో వస్తూన్న ట్రాక్టర్ ను అపి డ్రైవర్ అలకుంట సింహాద్రినీ ఇసుకకు సంబంధించి పత్రాలు అడుగగా ఎలాంటి పత్రాలు చుపించక పోవడంతో అక్రమంగా తరలిస్తున ఇసుక ట్రాక్టర్ ను పట్టుకొని పోలీస్ స్టేషన్ కి తరలించి సీజ్ చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.




# అతి వేగం ప్రమాదకరం

- ట్రాఫిక్ ఎస్సై సాయిరాం

సూర్యాపేట, విశాలభారతి

అతి వేగం ప్రమాదకరమని సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్సై సాయిరాం సూచించారు. రోడ్డుభద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం సూర్యాపేటలోని స్థానిక ఖమ్మం ప్లై ఓవర్ వద్ద వాహన చోదుకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై మాట్లాడుతూ..
ప్రతి ఒక వాహన దారుడు వాహనాలు నడిపేటపుడు అప్రమత్తంగా ఉంటూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. మైనర్లు వాహనాలను డ్రైవ్ చేయ రాదన్నారు. ఓవర్‌టేకింగ్, సెల్‌ఫోన డ్రైవింగ్, ట్రిబుల్ రైడింగ్, ఓవర్‌స్పీడు, ఓవర్‌లోడుతో రోడ్డుప్రమాదాలు జరుగుతున్నట్లు తెలిపారు. వాహనదారుల నిర్లక్ష్యంతోనే రోజురోజుకు రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుతోందన్నారు. ఈ మేరకు రోడ్డుప్రమాదాలు వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎస్సై వివరించారు. ఈ కార్యక్రమం లో పోలీస్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

# ఓటిఎస్ ద్వారా దీర్ఘకాల రుణాలు సద్వినియోగ పరుచుకోవాలి

- డిసిసిబి డైరెక్టర్ ఆమనగల్లు, సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా

ఆమనగల్లు, విశాల భారతి :



జిల్లా సహకార బ్యాంకు పాలకవర్గం ఏకగ్రీవ తీర్మానం మేరకు డిసిసిబి బ్యాంకులు, సహకార సంఘాల సొసైటీలు ద్వారా పొందిన ఆమనగల్లు, కడ్తాల్, మాడుగుల, తలకొండపల్లి మండలాల కు చెందిన పిఎసిఎస్ ల ద్వారా రుణాలు పొందిన దీర్ఘకాలిక రుణ మొండి బకాయిదారులు ఏకకాల రుణ పరిష్కార పథకం ఓ టి ఎస్ ద్వారా పరిష్కారం చేసుకోవాలని డిసిసిబి డైరెక్టర్, ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, డిసిసిబి మేనేజర్ గోపాలు తెలిపారు. శుక్రవారం ఆమనగల్లు సింగల్ విండో కార్యాలయంలో స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా సహకార బ్యాంకు పాలకవర్గ సమావేశంలో తీర్మానం ప్రకారం ఏకకాల రుణ పరిష్కార పథకం కు ఆమోదించడం జరిగిందన్నారు. ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలోని అనేక మంది రైతులు తమ రుణాలపై వడ్డీ భారం తగ్గించవలసినదిగా కోరడం జరిగిందని ఇందుకుగాను నిరర్ధక ఆస్తులను ఎన్పీఏ తగ్గించుటకు గాను ఏకకాల రుణ పరిష్కార పథకం ను ప్రతిపాదించడం జరిగిందని వారు తెలిపారు. ఏకకాల రుణ పరిష్కారానికి బ్యాంకు ద్వారా 31 3 2018 నాటికి రుణం తీసుకున్న రుణ గ్రహీతలు దీనికి అర్హులని ఆయన ప్రకటించారు. ఈ పథకాన్ని దీర్ఘకాలిక రుణ ఖాతాలు మరియు పీఎం ఈజిపి రుణాలకు మాత్రమే వర్తిస్తుందని వారు తెలిపారు. ఈ గడువు వచ్చేనెల 15 2 2025 వరకు దీర్ఘ కాలిక రుణ గ్రహీతలు సద్వినియోగపరచుకోవాలని వారు కోరారు. ఆమనగల్లు డిసిసిబి పరిధిలోని 4 మండలాలకు చెందిన దీర్ఘకాలిక మొండి బకాయిదారులు ఈ ఓ టి ఎస్ ను సద్వినియోగపరచుకొని కొత్తగా మళ్లీ రుణాలు పొందాలని డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్‌గుప్తా కోరారు. ఈ విలేకరుల సమావేశంలో సింగల్ విండో ఉపాధ్యక్షుడు దోనాదుల సత్యం, సూపర్వైజర్ రాజు, సీఈఓ దేవేందర్ సింగల్ విండో సిబ్బంది అల్లాజీ, పద్మకర్ తదితరులు పాల్గొన్నారు.




# రోడ్ల పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట, విశాలభారతి

రోడ్ల పనులను నాణ్యత ప్రమాణాలతో ప్రజావసరాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. శుక్రవారం పంచాయతీరాజ్, రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో రోడ్లు నిర్మాణాలు చేపట్టే క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టే క్రమంలో సంబంధిత శాఖ ఇంజనీర్లు మిషన్ భగీరథ ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో రోడ్ల నిర్మాణ కు సహకరించాలని కొన్నిచోట్ల నీటి సరఫరా పాత పైపులైన్లు పరిశీలించాలని, కాల పరిమితి ఆయనచో వాటి స్థానంలో రోడ్లకు ఇరువైపులా ముందస్తుగా క్షేత్ర స్థాయిలో పరిశీలించి నేటి సరఫరా పైపులైన్లు నిర్మాణం చేపట్టాలని వాటి అంచనా నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. రోడ్డు భవనాల శాఖ ఆధ్వర్యంలోని రోడ్లన్నీ టెండర్లు పూర్తయ్యాయని ఈఈ సీతారామయ్య కలెక్టర్ కు వివరించారు. గరిడేపల్లి టు జాన్పాడు రోడ్, అనంతగిరి టు చాన్పల్లి, దొండపాడు ఎన్హెచ్ 9 పనులు పూర్తయ్యాయని టెండర్లు పూర్తయిన పనులన్నీ 24 నుండి పనులు మొదలు పెడతామని తెలిపారు. కొన్నిచోట్ల ఎలక్ట్రికల్ స్తంభాలు షిఫ్టింగ్ జరుగుతుందని అది పూర్తయిన వెంటనే బీటీ రోడ్డు నిర్మాణం చేపడతామని ఈఈ పేర్కొన్నారు సూర్యాపేట పట్టణంలో ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ కొరకు స్థల పరిశీలన చేయాలని కలెక్టర్ ఈఈకి ఆదేశించారు. మంజూరైన పనులు చేపట్టడంలో జాప్యం ఉండకూడదని రోడ్ల పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ చేపట్టిన సిసి రోడ్లు డ్రైన్లు ఎంజిఎన్ఆర్ఇజిఎస్ కింద చేపట్టిన రోడ్లన్నీ మార్చి 30 ఒకటో తేదీ కల్లా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో చేపట్టిన ఆయుష్ బిల్డింగులని ఏప్రిల్ మొదటి వారంలో పూర్తయ్యేటట్లుగా పనులు జరగాలన్నారు. మండలాల్లోని అన్ని పాఠశాలలో టాయిలెట్స్ నిర్మాణం మార్చి రెండో వారంలో పూర్తి చేయాలన్నారు. ఎమ్మార్ఆర్,సి ఆర్ ఆర్ కింద చేపట్టిన పనులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో పి ఆర్ ఎస్సీ ప్రకాష్ ,ఈఈ వెంకటయ్య,ఈ ఈ ఆర్ అండ్ బి సీతారామయ్య, డి ఈ పవన్, మిషన్ భగీరథ ఇంజనీర్లు అరుణ్ కుమార్ రెడ్డి అధికారులు పాల్గొన్నారు.



# సాగుకు అనుకూలం లేని భూములను గుర్తించండి

ఆమనగల్లు, విశాల భారతి :

సాగుకు యోగ్యం కాని భూములను క్షుణ్ణంగా పరిశీలించి గుర్తించాలని కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్రె డ్డి ఆదేశించారు. శుక్రవారం కడ్తాల్లో రైతు భరోసా పరిశీలన ప్రక్రియను ఆయన పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. సాగుకు అనుకూలమైన భూములకే రైతు భరోసా అందుతుందని చెప్పారు. ఈనెల 21లోగా సాగుకు యోగ్యం కానీ, సాగుకు అనుకూలంమైన భూముల జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. తహసిల్దార్ ముంతాజ్, ఎంపీడీవో సుజాత పాల్గొన్నారు.



# 10 నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు

తరువాయి భాగం

తప్పదనే పరిస్థితులు ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గంలోని షాబాద్‌లో శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు దీక్షకు మాజీ మంత్రి కేటీఆర్ హాజరయ్యారు. రైతులతోపాటు అన్ని వర్గాలకు రేవంత్ రెడ్డి చేసిన మోసాలను వివరిస్తూనే కేటీఆర్ కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. స్థానికంగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పార్టీ ఫిరాయించడంపై కేటీఆర్ స్పందించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. 'బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి సంకలో చేరిండు. చేవెళ్లలో త్వరలో ఉప ఎన్నిక రాబోతుంది. చేవెళ్ల ఒక్కటే కాదు పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లోనూ త్వరలో ఎన్నికలు జరుగుతాయి' అని కేటీఆర్ సంచలన ప్రకటన చేశారు.

**బీఆర్ఎస్ ఎమ్మెల్యేల రాజీనామా..**

సీఎం రేవంత్ రెడ్డి.. రుణమాఫీ పేరిట రైతులను మోసం చేశారని.. కేటీఆర్ విమర్శించారు. రూ. 2 లక్షల రుణాలను మాఫీ చేసేందుకు డిసెంబర్ 9న సంతకం పెడుతా అన్నారని.. ఇప్పటికీ పూర్తిగా రుణమాఫీ కాలేదని ఫైర్ అయ్యారు. ఈ ముఖ్యమంత్రికి నిజాయితీ ఉంటే.. ఆయన సొంతూరు కొండారెడ్డిపల్లెకు పోదాం. కొడంగల్‌కు పోదాం. రుణమాఫీ అయిందని చెప్తే.. రాజీనామా కాదు రాజకీయ సన్యాసం తీసుకుంటానని అసెంబ్లీలో చెప్పాను. ఉలుకు పలుకు లేదు. రాష్ట్రంలో ఏ ఊరికైనా సరే.. డేట్, ప్లేస్, టైమ్ నీ ఇష్టం.. నువ్వు కాకపోతే నీ మంత్రులను పంపించు. వంద శాతం రుణమాఫీ అయిందని రాసిస్తే.. మొత్తం బీఆర్ఎస్ నేతలు రాజీనామా చేసి పోతామని కేటీఆర్ స్పష్టం చేశారు.

**ఎకరాకు రూ.15వేలు ఇవ్వాల్సిందే..**

కేసీఆర్ మీకు బిచ్చమేసినట్టు రైతుబంధు కింద రూ. 10 వేలు ఇస్తుండు.. నన్ను గెలిపిస్తే రూ. 15 వేలు ఇస్తానని అన్నారు. ఏడాది దాటిపోయింది.. ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ఎన్నికలప్పుడు రూ.7600 కోట్లు రైతుబంధు వేసేందుకు మేం సిద్ధమైతే.. ఈసీకి ఉత్తరం రాశారు. ఈ టైమ్‌లో వేస్తే కేసీఆర్‌కు ఓట్లు వేస్తారని చెబితే.. మోదీ ప్రభుత్వం ఆపింది. ఎన్నికలు అయిపోయాక రైతులను ఇబ్బంది పెడుతున్నారని కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్ హయాంలో నాట్లప్పుడు రైతుబంధు పడుతుండే.. ఇప్పుడు ఓట్లప్పుడు పడుతున్నాయి. కేసీఆర్ జమ చేసిన రూ. 7600 కోట్లను పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లప్పుడు వేశారు. వానాకాలం పంటకు రైతుబంధు ఇవ్వలేదు. అందుకే ఇవాళ ధర్నా పెట్టాం. ఇది ప్రారంభం మాత్రమే.. రాష్ట్రమంతా ధర్నాలు పెడుతాం. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రూ.15 వేలు రైతు భరోసా ఇవ్వాలి. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. వానాకాలం రైతుబంధును ఎగ్గొట్టారు. దాన్ని కూడా విడిచి పెట్టొద్దు అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అర గ్యారంటీ మాత్రమే అమలు చేస్తోందని కేటీఆర్ విమర్శించారు. రైతుల కోసం ఎన్ని పోరాటాలైనా చేస్తామని, ప్రభుత్వం తమపై ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని, జైలుకు వెళ్లేందుకైనా సిద్ధమని ప్రకటించారు.



# పసుపు బోర్డు కోసం ఎంపీ అరవింద్ ఎంతో కష్టపడ్డారు

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలేటి మల్లికార్జున్ రెడ్డి

బాల్కొండ, విశాల భారతి

పసుపు బోర్డు ఏర్పాటుకు కృషి చేసిన ఎంపీ అరవింద్, ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్ కు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలేటి మల్లికార్జున్ రెడ్డి, బీజేపీ నాయకులు కృతజ్ఞతలు తెలుపుతూ వారి చిత్ర పటానికి భీమ్‌గల్ మండల కేంద్రంలో క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఎల్.జే ఫంక్షన్ హాల్లో పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కార్యవర్గ సభ్యుడు ఏలేటి మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ.. పసుపు బోర్డు ఏర్పాటు కోసం ఎంపీ అరవింద్ ఎంతో కష్ట పడ్డారని, దానికి సాక్ష్యం నేనే అని తెలిపారు. గత ప్రభుత్వాలు కాంగ్రెస్, బీఆర్ఎస్ నిజామాబాద్ లో పసుపు బోర్డు ఏర్పాటు చేయాలి అనే ప్రతిపాదనలు కేంద్రంలో పెట్టకపోవడంతో మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రంలో పసుపు బోర్డు ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించిందని అన్నారు. కానీ అరవింద్ ఎంపీగా గెలిచిన తర్వాత నిజామాబాద్ జిల్లాలో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.దాని కోసం ఆయన అహర్నిశలు కష్టపడి 40 ఏండ్లు నిజామాబాద్ జిల్లా రైతుల కలని సాకారం చేశారని అన్నారు.పసుపు బోర్డుతో పాటు నిజామాబాద్ జిల్లా నాయకుడు పల్లె గంగారెడ్డి కి బోర్డు చైర్మన్ పదవి రావడం సంతోషంగా ఉందని అన్నారు.పసుపు బోర్డు కలని సాకారం చేయడంతో రైతులు స్వచ్ఛంగా ఎంపీ అరవింద్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్నారని తెలిపారు. ఎంపీ అరవింద్ ఇచ్చిన హామీని నెరవేరుస్తారనే నమ్మకంతో నిజామాబాద్ పార్లమెంటు రైతులు రెండోసారి గెలిపించారని, ఇచ్చిన మాట నేరవేర్చారని అన్నారు.పసుపు బోర్డు ఏర్పాటు కాగానే కాంగ్రెస్,బీఆర్ఎస్ తామే తెచ్చామని చెప్పడం సిగ్గు చేటు అని,బోర్డుపై మాట్లాడే అర్హత వారికి లేదన్నారు.గతంలో పసుపు బోర్డు ఏర్పాటు చేయించాలని ఎంపీ అరవింద్ పై దాడులు చేయించిన బీఆర్ఎస్ ఇప్పుడు బోర్డు ఏర్పాటులో కవిత ప్రమేయం ఉందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో విఫలం అయ్యిందని అన్నారు.కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే నిజాం షుగర్ ఫ్యాక్టరీ తెరిపించాలని అన్నారు.పసుపు బోర్డు ఏర్పాటు చేసిన ఎంపీ అరవింద్ ను కాంగ్రెస్,బీఆర్ఎస్ నాయకులు అభినందించి వారి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మూలిగే మహిపాల్,పట్టణ అధ్యక్షులు కనికరం మధు,నాయకులు తోట గంగాధర్,నీలం గంగాధర్,చందు,హాకీమ్, గంగాధర్ గౌడ్, సంధ్య రాజు,నవీన్, నవీన్,హరి ప్రసాద్,బూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



# మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి పొన్నం

సైదాపూర్, విశాల భారతి

మండలంలోని దుద్దెనపల్లి, ఎగ్లాస్పూర్, సోమారం, వెన్నంపల్లి గ్రామాలలో ఇటీవల మరణించిన కుటుంబ సభ్యులను శుక్రవారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శించారు. మృతుల ఫోటోలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన వెంట మార్కెట్ చైర్మన్ దొంత సుధాకర్, మాజీ జెడ్పీటిసి సభ్యులు గుండారం శోభ శ్రీనివాస్, గోపగోని నవీన్ గౌడ్,ఆసరి రఘు,వీరగొని శంకర్,సదానందం,దాసరి సందీప్,పడాల తిరుపతి,చల్లూరి రవి,తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలి

- సీఐ

ఆమనగల్లు, విశాల భారతి :



ఎస్ఐలుగా పదోన్నతి పొందిన ఏఎస్ఐలు విధులను నిబద్ధతతో నిర్వహించి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆమనగల్ సీఐ ప్రమోద్ కుమార్సూచించారు. శుక్రవారం ఆమనగల్లు ,తలకొండపల్లి,పోలీస్ స్టేషన్లలో ఏఎస్ఐలుగా విధులు నిర్వహిస్తున్న యాదయ్య, సీతారాంరెడ్డిలు ఎస్ఐలుగా పదోన్నతి పొందడంతో వారికి ఆయన బ్యాడ్జ్లను అందజేసి అభినందించారు. ఎస్ఐలు వెంకటేష్, శ్రీకాంత్, ఏఎస్ఐ మురళీధర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శనివారం,
18.01.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com


## ముత్యాల సునీల్ కుమార్ సౌజన్యంతో లిఫ్ట్ కు మోటార్ పంపిణీ



బాల్కొండ,విశాలభారతి

బాల్కొండ మండలం నాగపూర్ గ్రామ అభివృద్ధి కమిటీ గ్రామం లోని సెకండ్ లిఫ్ట్ కు మోటార్లు అవసరం ఉన్నాయని బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ముత్యాల సునీల్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు.గతంలోనే ఆ లిఫ్టుకు ఒక మోటార్ ని మంజూరు చేయించడం జరిగింది.రెండవ మోటార్ కోసం కూడా అడగగా ముత్యాల సునీల్ కుమార్ సంబంధిత కాంట్రాక్టర్ ను ఆదేశించి లిఫ్ట్ కు రెండవ మోటార్ ని కూడా పంపిణీ చేయించారు.అడగగానే మోటార్ లు మంజూరు చేయించిన ముత్యాల సునీల్ కుమార్ కి గ్రామ అభివృద్ధి కమిటీ, గ్రామ ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.



## ఎస్సీ వర్గీకరణ ప్రజాస్వామిక ఆకాంక్ష

- వ్యతిరేకుల కుట్రలను డప్పులతో ఎండగడతాం
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ

తొర్రూరు-విశాలభారతి:

ఎస్సీ వర్గీకరణ ఉద్యమం న్యాయబద్ధమైందని, ఫిబ్రవరి 7న లక్ష డప్పులతో మాదిగల సత్తా చాటుతామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ స్పష్టం చేశారు. ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా ఫిబ్రవరి 7న హైదరాబాదులో వెయ్యి గొంతులు, లక్ష డప్పులు కార్యక్రమంలో భాగంగా తొర్రూరు డివిజన్ కేంద్రంలో ఎమ్మార్పీఎస్, మాదిగ ఉద్యోగుల ఆధ్వర్యంలో డప్పులతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మందకృష్ణ డప్పు చేత పట్టుకొని కార్యకర్తలతో కదం తొక్కారు. అంబేద్కర్ విగ్రహం నుంచి పాల కేంద్రం వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్, కొండా లక్ష్మణ్ బాపూజీ, సర్వాయి పాపన్న విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విశ్రాంతి భవనంలో నిర్వహించిన సమావేశంలో మందకృష్ణ మాట్లాడుతూ వర్గీకరణ అంశం తుది అంకానికి చేరుకుందని, ప్రభుత్వాలు దాన్ని అమలు చేసేందుకై లక్ష డప్పులతో ఫిబ్రవరి 7న ఆకాంక్షను చాటుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య,మాజీ జెడ్పిటిసి మంగళపల్లి శ్రీనివాస్,మాదిగ ఉద్యోగ సంఘ,ఎమ్మార్పీఎస్ నాయకులు సోమారపు ఐలయ్య,మహంకాళి బుచ్చయ్య,పాటమ్మ రాంబాబు, బరిగెల బాబు, నకిరకంటి కొమురయ్య, రాయిశెట్టి వెంకన్న, నకిరకంటి వెంకన్న,బచ్చలి వెంకన్న, వెల్తూరి పూర్ణచందర్, మంద యాకమల్లు,రాయిశెట్టి ఉపేందర్,బిక్షపతి,సురేందర్ ఏర్పుల రమేష్ ఏర్పుల వెంకన్న గూడెల్లి రామచంద్రయ్య, రంజిత్ కుమార్,వెల్తూరు దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డులపై క్లారిటీ ఇచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్

సైదాపూర్ ,విశాలభారతి:



పాత రేషన్ కార్డులపై బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ క్లారిటీ ఇచ్చారు. గత 10 సంవత్సరాలుగా రేషన్ కార్డులు లేకుండా కొత్తగా పెళ్లి అయిన వారు, మార్పులు చేర్పులకు అర్హత ఉండి కూడా ఇబ్బంది పడుతున్నవారికి మంత్రి పొన్నం ప్రభాకర్ శుభవార్త చెప్పారు.జనవరి 26 నుండి కొత్త రేషన్ కార్డులు ఇచ్చే ప్రక్రియ కోసం గ్రామాల్లో సర్వే జరుగుతుందని అన్నారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని దుద్దెనపల్లి గ్రామంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు గుండారపు శోభ శ్రీనివాస్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే 2 కోట్ల 81 లక్షల మందికి 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయన్నారు. పాత 90 లక్షల రేషన్ కార్డులు చర్చ కాదని, పాత రేషన్ కార్డులు తొలగించడం లేదని, రేషన్ కార్డు అర్హత ఉండి రాకుంటే సంబంధిత అధికారికి, ప్రజా ప్రతినిధులకు విజ్ఞాపన పత్రాలు ఇవ్వొచ్చని పేర్కొన్నారు.ఇందులో ఎలాంటి కన్ఫ్యూజన్ లేదని, ఎవరైనా తప్పుడు ప్రచారం చేస్తే దానిని నమ్మవద్దన్నారు. ప్రతిపక్షాలు కావాలని రాజకీయం చేసి రాద్ధాంతం చేస్తున్నాయన్నారు. కుల సర్వే ఆధారంగా అప్లికేషన్ ల సమాచారం ఆధారంగా కొత్త రేషన్ కార్డులు వస్తున్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం రేషన్ కార్డులు అందిస్తుందన్నారు. అలాగే వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా కింద రూ.12 వేలు ఇస్తామన్నారు. భూమి లేని రైతు కూలీలకు రూ.12 వేలు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. అంతే కాకుండా రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాన్నే అన్నారు. అనంతరం మండలంలోని దుద్దెనపల్లి, ఎక్లాస్పూర్, సోమారం, గర్రెపల్లి, బూడిదపల్లి, వెన్నంపల్లి గ్రామాల్లో ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంత్రి వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ దొంత సుధాకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మిట్టపల్లి కిష్టయ్య, మాజీ జెడ్పీటీసీ సభ్యులు గుండారపు శోభ శ్రీనివాస్, సైదాపూర్ సింగిల్ విండో చైర్మన్ కొత్త తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు మేకల రవీందర్, లంక దాసరి అరుణ మల్లయ్య, చాంద్ పాషా, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు వేముల సాయి, గోపగోని నవీన్ గౌడ్,కొండల్ రెడ్డి,గొల్లపల్లి యాదగిరి,చల్లూరి రవీందర్, బైరి రాజు, భాస్కర్ నాయక్ ఉన్నారు.



## బిజెపి నూతన అధ్యక్షులుగా ఎన్నికైన కొణతం నాగిరెడ్డి

నేరేడుచర్ల, విశాలభారతి:

పట్టణ బిజెపి నూతన అధ్యక్షులుగా ఎన్నికైన కొణతం నాగిరెడ్డి ఆధ్వర్యంలో నేరేడుచర్ల ఎమ్మార్వో సైదులు ని కలిసి నేరేడుచర్ల పట్టణంలోని అర్హులైన నిరుపేదలకు ఇల్లు మంజూరు చేయాలని, రేషన్ కార్డులు ఇవ్వాలని, ఇళ్లస్థలం లేని నిరుపేదలకు ఇంటి స్థలం కూడా కేటాయించి,ఇంటిని మంజూరు చేయాలని అన్నారు. అలాగే అర్హులను ఎంపిక చేయటంలో అధికార పార్టీ జోక్యం లేకుండా చూడాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ బిజెపి ఉపాధ్యక్షులు జూలూరు అశోక్, కిసాన్ మోర్చా, అధ్యక్షులు తాళ్ల నరేందర్ రెడ్డి , సీనియర్ నాయకులు అంబటి నాగేశ్వరావు , రమణ, బూత్ అధ్యక్షులు ఏమిరెడ్డి శంకర్ రెడ్డి , కాలం నాగయ్య , ఎడవల్లి సైదిరెడ్డి , దేవిరెడ్డి నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ జిల్లా అసిస్టెంట్ సెరీకల్చర్ ఆఫీసర్ గా షరీఫ్

భీమదేవరపల్లి, విశాల భారతి :



మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ రషీద్ సెరికల్చర్ ఆఫీసర్ గా పనిచేస్తూ, అసిస్టెంట్ డైరెక్టర్ గా పదోన్నతి పొందారు. 2018 లో పదోన్నతిపై సెరికల్చర్ ఆఫీసర్ గా హనుమకొండ జిల్లాలో 2 సం.లు పనిచేసిన అనంతరం డిప్యూటేషన్ పై హుజురాబాద్ డివిజన్ లో 2024 వరకు విధులు నిర్వర్తించారు. రషీద్ కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ప్రజల మన్ననలు పొందారు. కరీంనగర్ కలెక్టర్ ఆదేశానుసారం రెండు గ్రామ పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్ గా పని చేస్తూ వారి మన్ననలు పొందారు. మొదటి నుండి వివిధ హోదాలలో ప్రజలకు సేవలు అందిస్తూ సెరికల్చర్ శాఖలో విశేష అనుభవం కలిగిన రషీద్ కు "సహాయ పట్టు పరిశ్రమ అధికారిగా" జనవరి 15న పదోన్నతి పొందారు. రషీద్ 1985లో సెరికల్చర్ శాఖలో దినసరి కూలీగా ఎల్కతుర్తి మండలం గోపాల్ పూర్ లో 4 సం.లు పనిచేశారు. 1989 లో స్కేల్ పోస్టు ఆపరేటర్ గా చేరి నేడు అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ సెరికల్చర్ ఆఫీసర్ గా పదోన్నతి పొందడం పట్ల చాలా సంతోషంగా ఉందని ఆనందాన్ని వ్యక్తం చేశారు. రషీద్ కు పదోన్నతి రావడం పట్ల హుజురాబాద్ మండల మాజీ సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు గూడూరు ప్రతాపరెడ్డి ఆనందం వ్యక్తం చేశారు.



## భద్రకాళి దేవికి వీరభద్ర స్వామికి నాగవెల్లి, పుష్పయాగం

భీమదేవరపల్లి, విశాల భారతి :

భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు గత వారం రోజులుగా జరుగుతున్నాయి. అందులో భాగంగా గురువారం భద్రకాళి దేవికి, వీరభద్ర స్వామికి ఆలయ అర్చకులు అత్యంత వైభవంగా నాగవెల్లి నిర్వహించారు. కల్యాణోత్సవంలో భాగంగా భద్రకాళి అమ్మవారికి నల్లపూసలు ధరింపజేసి, ఏకాంత సేవ నిర్వహించారు. అందరూ భక్తులు వద్రకాళి సమేత వీరభద్ర స్వామి దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈవో కిషన్ రావు, అర్చకులు రాజయ్య, శ్రీకాంత్, రాంబాబు వీరభద్రయ్య, రమేష్, శివకుమార్, శరత్ చంద్ర, శ్రావణ్, సందీప్ పాల్గొన్నారు.

## ఈ నెల 20లోగా క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేయాలి

కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

బాల్కొండ, విశాల భారతి



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత (రేషన్ కార్డులు), ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల ద్వారా అర్హులైన వారికి లబ్ధి చేకూర్చేందుకు వీలుగా అధికారులు క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రక్రియను నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శుక్రవారం పరిశీలించారు. ముప్కాల్ మండలం నాగంపేట్, బాల్కొండ మండలం జలాల్పూర్ గ్రామాలలో సర్వే బృందాలు క్షేత్రస్థాయి పరిశీలన జరుపుతున్న తీరును తనిఖీ చేశారు. వివిధ సంక్షేమ కార్యక్రమాల అమలు కోసం అర్హులను గుర్తించేందుకు అవలంభిస్తున్న విధానాలను, సర్వే బృందాలు ఇంటింటికి తిరుగుతూ సేకరిస్తున్న వివరాలను పరిశీలించారు. జలాల్పూర్ శివారులోని ఆయా సర్వే నంబర్లలో గల రైతులకు సంబంధించిన పట్టా భూములను ,అసైన్డ్ స్థలాలను పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయి పరిశీలన సందర్భంగా సేకరించిన వివరాలను రిజిస్టర్లలో స్పష్టంగా నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. త్వరితగతిన ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని, తప్పిదాలకు తావు లేకుండా పూర్తి పారదర్శకంగా లబ్ధిదారుల జాబితా రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలలో ఫీల్డ్ వెరిఫికేషన్ కొనసాగుతోందని తెలిపారు. ముఖ్యంగా రైతు భరోసా పథకం ద్వారా అర్హులైన ప్రతి రైతుకు లబ్ధి చేకూర్చేందుకు వీలుగా సాగుకు యోగ్యమైన భూములను సర్వే నెంబర్ల వారీగా క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా నిర్ధారించడం జరుగుతోందన్నారు. అదేవిధంగా ఆహార భద్రతా కార్డులను అర్హత కలిగిన కుటుంబాలకు అందించేందుకు వీలుగా ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అధికార బృందాలు క్షేత్రస్థాయి పరిశీలన జరుపుతున్నాయని తెలిపారు.ఈ నెల 20వ తేదీ నాటికి ఆయా పథకాల కింద అర్హులైన వారి జాబితాలను రూపొందించి, 21 నుండి 24వ తేదీ వరకు ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మండల స్పెషల్ ఆఫీసర్ల పర్యవేక్షణలో నిర్వహించనున్న గ్రామ సభలలో వాటిని ప్రవేశపెట్టి చదివి వినిపించడం జరుగుతుందన్నారు. గ్రామ సభ ఆమోదం మేరకు లబ్ధిదారుల వివరాలను సంబంధిత పోర్టల్ లో నమోదు చేస్తామన్నారు. ఈ నెల 26వ తేదీన ప్రభుత్వం రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు,ఆహార భద్రత (రేషన్ కార్డులు),ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల అమలుకు శ్రీకారం చుట్టి లబ్ధిదారులకు ప్రయోజనం చేకూర్చనుందని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ ఆర్డీఓ రాజాగౌడ్, ఆయా మండలాల స్పెషల్ ఆఫీసర్లు స్రవంతి,రసూల్ బీ,బాల్కొండ ఎంపిడిఓ విజయభాస్కర్ రెడ్డి,తహసీల్దార్ శ్రీధర్, బాల్కొండ ఎంపిఓ గంగా మోహన్ తదితరులు పాల్గొన్నారు.



## ఈనెల 19 న ఉచిత కంటి వైద్య శిబిరం

మునుగోడు విశాల భారతి

కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి క్యాంపు కార్యాలయం లో విలేకరుల సమావేశంలో శుక్రవారం నల్లగొండ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మేకల ప్రమోద్ రెడ్డి మాట్లాడుతూ ఆదివారం రోజున మునుగోడు పట్టణ కేంద్రంలోని చండూరు రోడ్డు లో గల కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 19న శంకర్ కంటి ఆసుపత్రి ఫీనిక్స్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న ఉచితకంటి వైద్యశిబిరం లో మునుగోడు,చండూరు,గట్టుప్పల్ మండలాల ప్రజలు పాల్గొని ఉచిత కంటి వైద్య సదుపాయం పొందాలని పిలుపునిచ్చారు. మునుగోడు,చండూరు,గట్టుప్పల్ మండలాలలోని అన్ని గ్రామాల నుండి కంటి వైద్య శిబిరానికి వచ్చే వారి ప్రయాణ సౌకర్యార్థం ఉచిత బస్సు సదుపాయం కల్పించడం జరిగింది అని,కంటి సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు, ఈ ఉచిత వైద్య శిబిరంలో రోగులు తప్పనిసరిగా ఆధార్ కార్డు తీసుకొని రావాలని కోరారు ఈ కార్యక్రమంలో మునుగోడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భీమనపల్లి సైదులు,నల్లగొండ జిల్లా యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు పాల్వాయి జితేందర్ రెడ్డి,సీనియర్ కాంగ్రెస్ నాయకులు వేమిరెడ్డి జితేందర్ రెడ్డి,మునుగోడు మండల కాంగ్రెస్ నాయకులు చెరుపల్లి వెంకన్న, మాదగోని రాజేష్ గౌడ్,నడిమిపల్లి యాదగిరి,జంగిలి నాగరాజు,మునుగోటి సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు



## ఎస్ఐగా పదోన్నతి పొందిన తంగళ్ళపల్లి గోవర్ధన్

భీమదేవరపల్లి, విశాల భారతి :

మండలంలోని ముల్కనూరులో ఏఎస్ఐ గా పని చేస్తూ సాధారణ బదిలీలలో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లా ఆత్మకూరు పోలీస్ స్టేషన్ లో ఏఎస్ఐ గా విధులు నిర్వహిస్తున్న తంగళ్ళపల్లి గోవర్ధన్ కు ఎస్ఐగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వులను వరంగల్ సిపి అంబర్ కిషోర్ ఝా నుండి శుక్రవారం అందుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ లో ఎస్ఐ గా పదోన్నతి పొందిన గోవర్ధన్ ను పోలీసులు అభినందించారు. ఈ సందర్భంగా ఎస్సై గోవర్ధన్ మాట్లాడుతూ, విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేయకుండా ఉన్నతాధికారుల ఆదేశానుసారం విధులు నిర్వహించాలని, ఉద్యోగంలో పనిచేసే ప్రతి ఒక్కరూ ఉన్నత స్థాయికి చేరే అవకాశాలు ఉంటాయన్నారు. పోలీసు ఉద్యోగంలో చేరిన నాటి నుండి ఉన్నత అధికారుల ఆశీస్సులతోనే పదోన్నతులు పొందుతున్నానని చెప్పారు. గోవర్ధన్ గతంలో హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ లో ఏఎస్ఐగా పనిచేస్తూ ప్రజల మన్ననలు పొందారు. గోవర్ధన్ కు ఎస్ఐగా పదోన్నతి రావడం పట్ల భీమదేవరపల్లి మండల ప్రజలు హర్ష వ్యక్తం చేశారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శనివారం,
18.01.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



# అంతర్జాతీయ సాహిత్య సదస్సులో ప్రసంగించిన డా. యడవెల్లి సైదులు

సికింద్రాబాద్, విశాలభారతి:




వీరనారి చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయంలో " భారతదేశ సమకాలీన నాగరికతకు ఉర్దూ భాష సాహిత్యాన్ని ప్రోత్సహించడంలో ముస్లిమేతర కవులు మరియు రచయితల పాత్ర" అనే అంశంపై జరుగుతున్న అంతర్జాతీయ సాహిత్య సదస్సులో సీతాఫల్మండి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు గెస్ట్ లెక్చరర్ గా పనిచేస్తున్న డా. యడవెల్లి సైదులు పాల్గొని పత్ర సమర్పణ చేశారు. ఈ సదస్సులో సైదులు దాశరధి కృష్ణమాచార్యుల కవిత్వంలో ఉర్దూ సాహిత్య పరిచయం అనే అంశంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. " ఉర్దూ సాహిత్య సౌందర్యాన్ని గజల్ మరియు రూబాయిల ద్వారా తెలుగు సాహితీ లోకానికి పరిచయం చేసిన గొప్ప కవి దాశరధి" అని పేర్కొన్నారు. తెలంగాణ ప్రాంతం నుంచి సినీ గేయాలు రాసిన కవులలో ఉర్దూ సాహిత్యాన్ని ఎక్కువగా ప్రయోగించిన కవులలో దాశరధి ఒకరని ఆయన ఈ సందర్భంగా వాక్యానించారు. ఈ అంతర్జాతీయ సాహిత్య సదస్సుకు అధ్యక్షత వహించిన కోటి మహిళా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్స లర్ ప్రో. సూర్య ధనంజయ్ ,విశిష్ట అతిథిగా విచ్చేసిన టి జె పి ఎస్ టి చైర్మన్ డాక్టర్ బుర్ర వెంకటేశం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల సీతాఫల్మండి ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్రంలు తెలుగు సాహిత్యంలో విశేషంశాలపై పరిశోధనలు, పత్ర సమర్పణలు చేస్తున్న యడవెల్లి సైదులను అభినందించారు. యడవల్లి సైదులు ఓయూ తెలుగు శాఖలో రాళ్ల బండి కవితా ప్రసాద్ రచనలు పరిశీలన అనే అంశంపై పరిశోధన చేయడమే కాక క్యాంపస్ నానీలు అనే కవితా సంపుటి తో సంపుటిని వెలువరించారు. సాహిత్యాన్ని రాయడం చదవటమే కాక ఈ విధంగా సాహిత్య సదస్సులో పాల్గొనడం తనకు ఎంతో ఆనందాన్ని ఇస్తుందని ఆయన తెలియజేశాడు.

## రేషన్ కార్డు,రైతు భరోసా సర్వేను పరిశీలించిన అదనపు కలెక్టర్

బాల్కొండ,విశాలభారతి



బాల్కొండ నియోజకవర్గం భీమ్‌గల్ మండలం చెంగల్ గ్రామంలో అదనపు కలెక్టర్ అంకిత్ రేషన్ కార్డు,రైతు భరోసా సర్వేను పరిశీలించారు.ఈ పరిశీలనలో అధికారులు చేస్తున్న పనితీరును పర్యవేక్షించారు.సర్వేలో వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని ఆదేశించారు.సర్వేలో ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా, క్షేత్రస్థాయిలో పరిశీలించి సర్వేను పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమ్‌గల్ తహశీల్దార్ షబ్బీర్,ఎంపిడిఓ సంతోష్ కుమార్, ఎలక్షన్ డిటి అశ్విన్ అధికారులు పాల్గొన్నారు.





# బిలా దాఖలా భూములు గిరిజనులకే చెందాలి

- మెదక్ ఎంపీ ఎం.రఘునందన్ రావు
- రాత్రికి రాత్రి గోడలు నిర్మించడం చట్ట విరుద్ధం
- గిరిజనులతో కలిసి ఎంపీ నిరసన

పటాన్ చెరు(రామచంద్రాపురం)

బిలా దాఖలా భూములు గిరిజనులకే చెందాలని మెదక్ ఎంపీ ఎం.రఘునందన్ రావు డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల తాండాలో బిలా దాఖలా భూములను శుక్రవారం మెదక్ ఎంపీ రఘునందన్ రావు పరిశీలించారు. గిరిజనుల భూములను వారికి కాకుండా చేస్తున్న శక్తులపై పోరాటం కొనసాగుతుందంటూ స్థానిక ప్రజలతో కలిసి వారికి మద్దతుగా ఎంపీ రోడ్డుపై బైఠాయించి, సాయంత్రం వరకు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఎస్పీ, వచ్చి భూములను పరిశీలించేంత వరకు తమ పోరాటం ఆగదని తేల్చి చెప్పారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల గ్రామం సర్వే నంబర్ 434లోని మిగులు భూములలో ఇచ్చిన అక్రమ పట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పేద గిరిజనులకు ఇచ్చిన పట్టాలను మార్చేసి బడా బాబులకు కట్టబెట్టడం దారుణం అన్నారు. సర్వే నంబర్ 434 చుట్టూ 9వ తేదీన లేని గోడలు సంక్రాంతి సెలవుల తర్వాత 17వ తేదీన ఎలా వచ్చాయని, మర్యాదగా తీయకపోతే ఎలా తొలగించాలో తమకు తెలుసని ఆయన హెచ్చరించారు. బడాబాబులకు దారాదత్తం చేసిన దొంగపట్టాలను రద్దు చేయాల కోరారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా పోలీసుల సహకారంతో రాత్రికి రాత్రి వివాదాస్పద భూముల్లో ప్రహరీ గోడలు నిర్మించడం చట్ట విరుద్ధం అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈ అంశంపై పూర్తి వివరాలు అందించకుండా డిజిపి, ఇంటెలిజెన్స్ ఐజీలు అక్రమార్కులకు వంత పాడుతున్నారని ఆరోపించారు. 80 సంవత్సరాల నుండి సాగు చేసుకుంటున్నా గిరిజనులకు పట్టాలిచ్చే వరకు తమ నిరసన కొనసాగుతుందని హెచ్చరించారు. అక్రమంగా నిర్మించిన ప్రహరీ గోడను రాబోయే రెండు రోజుల్లో తొలగించకపోతే నిరవధిక నిరసన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. అక్రమార్కులకు సహకరిస్తున్న పోలీసు, రెవెన్యూ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రూ.2000 కోట్ల కుంభకోణం వెనక ఉన్న ప్రతి ఒక్కరిపై చట్ట ప్రంగారంగా చర్యలు తీసుకోవాలని మెదక్ ఎంపీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గిరిజనులు, తదితరులు పాల్గొన్నారు.

# బ్రహ్మోత్సవాలలో భద్రకాళి సమేత వీరభద్రుడికి వైభవంగా త్రిశూల స్నానం

- స్వామివారికి త్రిశూల స్నానం నిర్వహించిన ఆలయ చైర్మన్, ఈవో, అర్చకులు
- హాజరైన సిఐ పులి రమేష్, ఎస్సై సాయిబాబు
- నేడు అగ్ని గుండాలు, అధిక సంఖ్యలో తరలిరానున్న భక్తులు
- అగ్ని గుండాలతో బ్రహ్మోత్సవాలు ముగింపు

భీమదేవరపల్లి, విశాలభారతి :



కొత్తకొండ జాతర బ్రహ్మోత్సవాల్లో భద్రకాళి సమేత వీరభద్రస్వామికి త్రిశూలస్నాన విశేషంగా అష్టభైరవార్చన, నిత్యొపాసన, రుద్ర హోమం, శక్తి హోమం, మహా పూర్ణాహుతి నిర్వహించారు. అర్చన, నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించారు. శుక్రవారం కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ మూర్తులను పల్లకీ సేవలో ఊరేగించారు. వీరశైవులు వీర ఖడ్గాలు వేస్తూ, పల్లెరంతో ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపు సందర్భంగా వేలాది మంది భక్తులు స్వామి వారి పల్లెర కార్యక్రమాన్ని కన్నుల పండువగా తిలకించారు. అనంతరం పుష్కరిణి వరకు తీసుకెళ్లి, భూత బలిని నిర్వహించి పుష్కరిణిలో త్రిశూలస్నానం నిర్వహించారు. త్రిశూలేశ్వరిణితో సైతంగా అధికారులు, అర్చకులు, భక్తులు దివ్య స్నానం ఆచరించారు. త్రిశూల స్నానం ఆచరించే భక్తులు వారికి ఉండే శరీర, రోగ, శత్రు బాధతలు తొలుగుతాయని భక్తుల నమ్మకం. అనంతరం ధ్వజారోహణం కార్యక్రమాన్ని నిర్వహించి, స్వామివారికి అర్చకులు, పాలకవర్గ సభ్యులందరూ కలిసి పుష్పయాగం నిర్వహించారు. ఈ కార్యక్రమాలు ముగిసిన తర్వాత చివరగా అర్చకులు పూర్ణాముతి నిర్వహించి ముగింపు పలికారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చంద్రశేఖర్ గుప్తా, ఈవో కిషన్ రావు, సిఐ పులి రమేష్, ఎస్సై సాయిబాబు, డైరెక్టర్ కొంగోండ సమ్మయ్య, అర్చకులు రాజయ్య, శ్రీకాంత్, మొగిలిపాలెం రాంబాబు వీరభద్రయ్య, రమేష్, శివకుమార్, శరత్ చంద్ర, శ్రావణ్, సందీప్ పాల్గొన్నారు.



# కొత్తకొండ వీరన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే

భీమదేవరపల్లి, విశాల భారతి :

ఉత్తర తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన భీమదేవరపల్లి మండలంలోని సుప్రసిద్ధ కొత్తకొండ శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలలో త్రిశూల స్నాన కార్యక్రమాన్ని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక నాయకులతో కలిసి జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణ కుంభం, గుమ్మడి కాయతో ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే పల్లా వేద ఆశీర్వచనం స్వీకరించి తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో వేలేర్ మాజీ జెడ్పిటిసి చాడ సరిత, మండల పార్టీ ఇంచార్జ్ భూపతి రాజు, మాజీ వైస్ ఎంపీపీ సంపత్, మాజీ మండల ఆప్షన్ మెంబర్ మహమ్మద్ జానీ, మాజీ మండల పార్టీ అధ్యక్షులు దేవేందర్ బిఆర్ఎస్ కార్యకర్తలు, యూత్ సీనియర్ కార్యకర్తలు పాల్గొన్నారు.



# హెల్మెట్ తో ప్రయాణం సురక్షితం

తొర్రూరు-విశాలభారతి:

రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని తొర్రూర్ పట్టణంలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ హాల్ లో రోడ్ సేఫ్టీ భద్రత ట్రాఫిక్ నియమాలు పాటించవలసిన జాగ్రత్తలపై మదర్ వాలంటరీ ఆర్గనైజేషన్ మరియు రవాణా శాఖ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాలకుర్తి శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు బాధ్యతయూతంగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, హెల్మెట్ ధరించాలని అన్నారు. అనంతరం రవాణా శాఖ అధికారులు రోడ్ సేఫ్టీ భద్రత ట్రాఫిక్ నియమాలు పాటించవలసిన జాగ్రత్తలపై వివరిస్తూ ట్రాఫిక్ నిబంధనలు పక్కాగా పాటించాలని అధిక దూరం ప్రయాణించినప్పుడు విశ్రాంతి తీసుకోవాలని, శీతాకాలం వర్షాకాలం లలో రోడ్డుపై ప్రయాణించే సమయాలలో తీసుకోవలసిన జాగ్రత్తలు, తదితర అంశాలపై అందరికీ అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించారు, జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు, తేదీ జనవరి 1 నుండి 31, వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం హెల్మెట్స్ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో తొర్రూర్ మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామ చంద్రయ్య, తొర్రూర్ మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, డి టి ఓ జైపాల్ రెడ్డి, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఎం.సాయి చరణ్, మదర్ వాలంటరీ ఆర్గనైజేషన ప్రతినిధి విక్రమ్ పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమిస్తాం

- సూర్యాపేట జిల్లా కేంద్రంలో పక్కా జర్నలిస్టు భవన్ ఏర్పాటు చేయాలి

సూర్యాపేట, విశాల భారతి



జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించే వరకు తమ ఉద్యమాలను విడతలవారిగా కొనసాగిస్తామని పోరాటాల పురిటిగడ్డ సూర్యాపేట జిల్లా కేంద్రంలో జర్నలిస్టు భవనం ఏర్పాటు ప్రక్రియ వెంటనే చేపట్టాలని, సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన పలువురు సీనియర్ జర్నలిస్టు లు ప్రభుత్వంను కోరారు. తెలంగాణ స్టేట్ జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక వాణిజ్య భవన్ సెంటర్ లో నిర్వహించిన శాంతిదీక్ష కార్యక్రమానికి మద్దతును ఇచ్చి సంఘీభావం ప్రకటించిన అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు లో జర్నలిస్టులు కీలక పాత్ర పోషించిన సంగతి పాలకులు మరచిపోవద్దని అన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు ఉచితంగా సేవ చేస్తున్న జర్నలిస్టు లను విస్మరించి పాలకులు మాత్రం లబ్ధి పొందుతున్నారని తెలిపారు. జర్నలిస్టు లకు కనీస వేతనాలు, కొత్త వారికి అక్రిడేషన్ లు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. వర్కింగ్ జర్నలిస్టులు అందరికి ఎటువంటి ఆంక్షలు లేకుండా ఇంటి స్థలాలు ఇచ్చి, పక్కా ఇల్లు నిర్మాణం చేపట్టి ఇవ్వాలని కోరారు. జర్నలిస్టు భవనాలు లేకపోవడం వలన ప్రస్తుతం జర్నలిస్టులు రోడ్ల మీద గడిపే దయనీయమైన పరిస్థితి దాపురించిందని అన్నారు. అన్ని ప్రైవేటు ఆసుపత్రుల లో చెల్లుబాటు అయ్యే విధంగా జర్నలిస్టులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంకా తాము ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అన్నారు. యూనియన్ లకు అతీతంగా జర్నలిస్టుల సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం చేపడతామని తెలిపారు. తమ పిలుపును అందుకుని యూనియన్ లకు అతీతంగా వచ్చి శాంతి దీక్షకు మద్దతు ఇచ్చిన జర్నలిస్టు లు అందరికి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కందుకూరి యాదగిరి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు గుండా శ్రీనివాస్ గుప్త, బంటు కృష్ణ, బూపతి రాములు, వేణుమాధవ్, పి. సైదిరెడ్డి, తొలిదశ ఉద్యమకారులు బొమ్మడి లక్ష్మినారాయణ, బచ్చు పురుషోత్తం, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, కొండా శ్రీనివాస్, మల్లికార్జున్, పల్లె మణిబాబు, కొండ్లె క్రష్ణయ్య, జలగం మల్లేష్, గట్టు అశోక్, క్యూ న్యూస్ రిపోర్టర్ శ్రీనివాస్, ఉయ్యాల నర్సయ్య, దేవరగట్ల సతీష్, మామిడి శ్రవణ్, జహీర్, వాసా చంద్రశేఖర్, సోమా సుమన్, పాషా, పడిసిరి వెంకట్, వల్దాస్ శంకర్, అహ్మద్ లతో పాటు అసోసియేషన్ రాష్ట్ర నాయకులు మహ్మద్ గౌసుద్దిన్, దుర్గం బాలు, చిరంజీవి, వెంకట్, సాయి కృష్ణ, మధుసూధన్, శ్రీకాంత్,తదితరులు పాల్గొన్నారు.

# గుడుంబా నిర్మూలనకు కృషి చేయాలి

- ఫిబ్రవరి 15 వరకు స్పెషల్ డ్రైవ్ చేపడుతాం
- ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ అంజన్ రావు

తొర్రూరు-విశాలభారతి:



గుడుంబా నిర్మూలనకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు, ఉమ్మడి వరంగల్ జిల్లాను గుడుంబా రహితంగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ జి. అంజన్ రావు తెలిపారు. తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిటెండెంట్, తొర్రూరు ఇంచార్జ్ రాజేశుని ప్రవీణ్ తో కలిసి డిప్యూటీ కమిషనర్ మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 15 నుంచి ఫిబ్రవరి 15 వరకు గుడుంబా నియంత్రణకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎక్సైజ్, టాస్క్ ఫోర్స్, ఎన్ఫోర్స్మెంట్ విభాగాలను సమన్వయం చేసుకొని ఫిబ్రవరి 15 వరకు ప్రత్యేక బృందాలతో డ్రైవ్ కొనసాగనుందని వెల్లడించారు. సిబ్బంది అంకిత భావంతో, నిబద్ధతతో విధులు నిర్వహించి సారా నియంత్రణ లో మంచి ఫలితాలు తీసుకురావాలని ఆదేశించారు. సారా తయారీకి వినియోగించే బెల్లం, ఇతర ముడిపదార్థాల క్రయ, విక్రయాలు, రవాణా జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సారా తయారీ కేంద్రాలు ఎక్కడున్నాయో క్షేత్రస్థాయిలో ప్రత్యేక సమాచారాన్ని సేకరించి దాడులు చేస్తామన్నారు. ఎఫ్ఐఆర్ నుంచి చార్జ్‌షీట్ దాఖలు వరకు సీజర్ రిపోర్టు, అరెస్ట్, కేసు ప్రాపర్టీ వంటి అంశాలు చట్ట ప్రకారం జరుగుతాయన్నారు. గుడుంబా ప్రభావిత ప్రాంతాల్లో దాడులు నిర్వహించడంతోపాటు దానివల్ల కలిగే నష్టాలను వివరిస్తూ గ్రామీణ ప్రజలను చైతన్యవంతం చేస్తామన్నారు. గుడుంబా తయారు చేసి అమ్మేవారు, గతంలో కేసుల్లో ఉన్నవారు, అనుమానం ఉన్న వారిని కూడా బైండోవర్ చేస్తామన్నారు.గత సంవత్సరం 495 మందిపై కేసు నమోదు చేశామని,33 టన్నుల నల్ల బెల్లం పట్టుకున్నామని,107 వాహనాలను సీజ్ చేశామని,283 మందిని బైండోవర్ చేయడం జరిగిందన్నారు.ఈ సమావేశంలో ఎక్సైజ్ ఎస్ఐలు ఎం.రవళి రెడ్డి,ఎన్ శంకర్, తిరుపతి, బి.మధు సిబ్బంది పాల్గొన్నారు.



# పాస్టర్ దారావత్ సక్రం నాయక్ ఆదరణ సభ

- పాల్గొన్న సూర్యాపేట జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు
- బిషప్ డా దుర్గం ప్రభాకర్.

సూర్యాపేట, విశాలభారతి


చివ్వేంల మండల కేంద్రంలోని పాండ్య నాయక్ తండా కీ. శే పాస్టర్ దారావత్ సక్రం నాయక్ తన స్వగృహం నందు శుక్రవారం ఆదరణ కూడిక నిర్వహించడం జరిగింది. భార్య ధరవత్ అనసూర్య, ధరవాత్ షాలేం, ధరవత్ సాత్విక్, బంధువులు పాల్గొనగా ఈ సభకు ముఖ్య అతిధులుగా జి. బి. బి. యం సంస్థ వ్యవస్థాపకులు రెవ. డా. కె. శ్రీనివాస్ సుజాత నాయక్ లు పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బిషప్ డా. దుర్గం ప్రభాకర్ మాట్లాడుతూ గొప్ప దైవజనులను కోల్పోయినమని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమం లో చార్లెట్ హోం వ్యవస్థాపకులు బ్రదర్ జాటోత్ డేవిడ్ రాజు,చివ్వేంల పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రెవ.గుగులోతు బాలాజీ నాయక్, రీచ్ ఇండియా వ్యవస్థాపకులు ధరవత్ లాకు రేణుక నాయక్, పెన్ పహాడ్ పాస్టర్స్ పెలోషిఫ్ అధ్యక్షులు రెవ. డా. డి. జాన్ ప్రకాష్, బానోత్ సుధాకర్ నాయక్ , రెవ. డా. పంది మార్కు, రెవ. తీగల జాన్సన్, పాస్టర్ అదిమల్ల సందీప్,పాస్టర్ వరికుప్పల మత్తయి,పాస్టర్ బి.మోతిలాల్ నాయక్ ,పాస్టర్ బి.లింగ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

శనివారం,
18.01.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com





# డివిజన్ లో పర్యటించండి.. అభివృద్ధికి సహకరించండి

- రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప నగేష్
- జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ కు వినతి

పటాన్ చెరు,విశాలభారతి

రామచంద్రాపురం డివిజన్ పరిధిలో పర్యటించాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి కార్పొరేటర్ బూరుగడ్డ పుష్ప నగేష్ కోరారు. డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేసి సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. శుక్రవారం జోనల్ కమిషనర్ కార్యాలయంలో కార్పొరేటర్ పుష్ప జెడ్సీ ఉపేందర్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివిజన్ అభివృద్ధిపై చర్చించారు. రామచంద్రపురం శ్రీనివాస్ నగర్ కాలనీ సండే మార్కెట్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న బాలవిహార్ పార్కు పనులు ఇంకా చేపట్టాల్సి ఉన్నాయని, పార్కును సందర్శించి మిగతా పనులను పూర్తి చేయించాలని కోరారు. రామచంద్రాపురం డివిజన్ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నామని, మరింత అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించాలని జోనల్ కమిషనర్ ను కోరినట్టు కార్పొరేటర్ పుష్ప నగేష్ చెప్పారు. తన విజ్ఞప్తిని సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ త్వరలోనే డివిజన్లో పర్యటించి పెండింగ్ పనుల కోసం నిధులు మంజూరు చేయించి, అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు.

## కొలుగూరి రాజుకు మంత్రి పొన్నం పరామర్శ



భీమదేవరపల్లి,విశాలభారతి :
కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలుగూరి రాజు కాలు నొప్పితో బాధపడుతుండగా రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ గౌడ్ శుక్రవారం రాత్రి మండలంలోని ములుకనూర్ లోని రాజు ఇంటికి చేరుకొని ఆయనని పరామర్శించారు. మంత్రి వెంట కాంగ్రెస్ నాయకులు చిట్టెంపెల్లి ఐలయ్య, చిదురాల స్వరూప, బొజ్జపురి అశోక్ ముఖర్జీ, ఆదర్ రవి, నరేందర్, రాజు. వరుణ్, శ్రీకాంత్, కిషోర్, శ్రావణ్ తదితరులున్నారు.





# గ్రామాల సమగ్ర అభివృద్ధి మా లక్ష్యం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- జిన్నారం మండలంలో రూ.3 కోట్ల 90 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పటాన్ చెరు(జిన్నారం), విశాలభారతి

పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని ప్రతి పల్లె సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని స్థానిక శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని అండూరు, రాళ్లకత్వ, సొలక్పల్లి, ఊట్ల, వావిలాల, జంగంపేట, జిన్నారం, కొర్లకుంట, కొడకంచి, అలీ నగర్ తదితర గ్రామాలలో మూడు కోట్ల 90 లక్షల రూపాయల నిధులతో చేపట్టనున్న సిసి రోడ్లు, అంతర్గత మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు గ్రామీణ ప్రాంతాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమాలలో మాజీ జెడ్పి వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్, సీనియర్ నాయకులు వడ్డే కృష్ణ, శ్రీకాంత్ రెడ్డి, ఆయా గ్రామాల తాజా మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన..**

మండల కేంద్రమైన గుమ్మడిదలలో 40 లక్షల రూపాయల నిధులతో చేపట్టనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం స్థానిక శాసన సభ్యులు గుడెం మహిపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రతి గ్రామం అభివృద్ధికి ప్రతీకగా నిలుస్తా ఉందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పూర్తి పారదర్శకతతో సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కుమార్ గౌడ్, సీనియర్ నాయకులు నర్సింగరావు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వరసకు కూతురయ్యే బాలికపై లైంగిక దాడి

- ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో అమానుష సంఘటన
- నిందితుడిపై పాక్సో కేసు నమోదు



ఇబ్రహీంపట్నం,విశాలభారతి:

సంక్రాంతి పండుగ సందర్భంగా కొత్త దుస్తులు కొనిస్తానని వరసకు కూతురయ్యే బాలికను తీసుకెళ్లి ఓ కామాంధుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.ఇబ్రహీంపట్నం మండలంలోని ఓ గ్రామానికి చెందిన గడ్డం ఆంజనేయులు (31) అనే వ్యక్తి తుర్కయంజాల్ లో నివాసం ఉంటూ, మంగలి పని చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. అతని సొంత అన్న కూతురు (14) యాచారంలో 9వ తరగతి చదువుతోంది. గురువారం సాయంత్రం స్వగ్రామానికి వెళ్లిన ఆంజనేయులు మైనర్ బాలికకు కొత్త బట్టలు కొనిస్తానని తుర్కయంజాల్ కు తీసుకెళ్లి, ఆ తర్వాత సాయంత్రం 7:30 గంటల ప్రాంతంలో ఓ హోటల్ లోని ఓయో రూంకు తీసుకెళ్లి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాలిక ప్రతిఘటించి తప్పించుకొని భయంతో బయటకు వచ్చి కేకలు వేస్తూ రోడ్డు పక్కన వారికి విషయం చెప్పగా వారు 100 ఫోన్ చేసి చెప్పారు. ఆంజనేయులు పారిపోయే ప్రయత్నం చేయగా.... పోలీసులు అతన్ని పట్టుకున్నారు. తల్లిదండ్రులు ఆదిభట్ల పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా, ఆంజనేయులు పై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇది ఇలా ఉండగా నిందితుడు ఆంజనేయులుకు వివాహం అయ్యి ఇద్దరు పిల్లలు ఉన్నారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

# బీటెక్ విద్యార్థిని అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు

- నిందితుడు గుర్రంపోడు మండలం జిన్నాయి చింత గ్రామానికి చెందిన అక్కన బోయిన అజిత్
- వివరాలు వెల్లడించిన ఏసిపి కెవిపి రాజు



ఇబ్రహీంపట్నం,విశాలభారతి;
బీటెక్ చదువుతున్న విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితుడ్ని అరెస్టు చేసినట్టు ఇబ్రహీంపట్నం ఏసిపి కెవిపి రాజు శుక్రవారం తెలిపారు. గత రెండు రోజుల క్రితం ఆదిభట్ల మున్సిపాలిటీలోని మంగళ్ పల్లి హాస్టల్ లో ఉంటూ ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినిపై నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం జిన్నాయి చింత గ్రామానికి చెందిన అక్కన బోయిన అజిత్ (22) ఆ విద్యార్థినిపై లైంగిక దాడి చేశారు. హాస్టల్లో దూరి గదిలో ఒంటరిగా ఉన్న బీటెక్ విద్యార్థిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. విషయం తెలిసిన పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని విద్యార్థినిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా పోలీసులు నిందితున్ని పట్టుకొని రిమాండ్ కు తరలించారు.



# కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సహకరించండి

- ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డికు బీరంగూడ వాసుల వినతి

పటాన్ చెరు(అమీన్ పూర్),విశాలభారతి
అమీన్ పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడ ప్రాంతంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సహకరించాలని కోరుతూ శుక్రవారం సాయంత్రం బీరంగూడ ప్రాంతానికి చెందిన పుర ప్రముఖులు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేగూడెం మహిపాల్ రెడ్డికి వినతిపత్రం అందించారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న బీరంగూడ ప్రాంతంలో ప్రజల అవసరాల కోసం కమ్యూనిటీ హాల్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. 993 ప్రభుత్వ సర్వే నంబర్ లో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిని కేటాయించాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే జిఎంఆర్.. ప్రభుత్వంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అమీన్ పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, ఎడ్ల రమేష్, ఆదెల్లి రవీందర్, వివిధ పార్టీల నాయకులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.



# పేటలో సుధా బ్యాంక్ రజతోత్సవ వేడుకలు ప్రారంభం

సూర్యాపేట, విశాలభారతి

సూర్యాపేట లో సుధా బ్యాంక్ ప్రారంభించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం సుధా బ్యాంకులో రజతోత్సవ వేడుకలను బ్యాంక్ చైర్మన్ మీలా మహదేవ్, మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్ లు ప్రారంభించారు. బ్యాంకులోని మినీ ఆడిటోరియం లో జరిగిన వేడుకల కార్యక్రమం లో చైర్మన్ మీలా మహదేవ్ కేక్ కట్ స్వీట్స్ పంపిణీ చేశారు. సూర్యాపేట సర్వీస్ బ్రాంచ్ లో కొత్తగా నిర్మించిన స్ట్రాంగ్ రూమ్ లాకర్లను ప్రారంభించి మొదటి లాకర్ ను భాగ్యశ్రీ వెంకన్న కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రజతోత్సవ వేడుకలు సందర్భంగా 3 రోజుల పాటు వేడుకలు నిర్వ హిస్తునట్లు ఇస్తున్నట్లు వారు తెలిపారు. అందులో భాగంగా ఈనెల 18 శనివారం పుష్య బహుళ పంచమి సందర్భంగా 22వ త్యాగరాజ ఆరాధన ఉత్సవాలు సూర్యాపేట లోని త్రివేణి గార్డెన్ లో ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్ఆర్ఐ ఆప్త ఫౌండర్ చిమట శ్రీనివాస్ పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సంగీత విధ్వంసురాలు డాక్టర్ ద్వారం లక్ష్మీ ని సన్మానించనున్నట్లు వెల్లడించారు. పోపూరి పల్లవి చే కర్ణాటక గాత్ర కచేరి తో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు అందులో బాగంగా రజతోత్సవ, త్యాగరాజ ఆరాధన ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో బ్యాంక్ వైస్ చైర్మన్ పొనుగోటి నిర్మల, డైరెక్టర్లు బొనగిరి భాస్కర్, కక్కిరేని చంద్రశేఖర్, శంకర్ లాల్, ఏపూరి శ్రవణ్ కుమార్, బానావత్ సుజాత, డాక్టర్ మీలా సందీప్ పుర ప్రముఖులు పెద్దిరెడ్డి రాజా ,తోట శ్యామ్ ,గుడిపూడి వెంకటేశ్వర రావు, అప్పం శ్రీనివాసరావు,గాలి శ్రీనివాస్, భాగ్యశ్రీ వెంకన్న, తోట సత్యనారాయణ, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ లక్ష్మారెడ్డి, ఫాస్ట్ ప్రెసిడెంట్ రవీందర్ రెడ్డి, రాచకొండ శ్రీనివాస్, మేనేజర్లు సైదులు, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# పంట పండిస్తున్న భూమికే రైతు భరోసా

- భూ రికార్డులను పరిశీలించిన ఆర్డీవో అనతరెడ్డి , ఎమ్మార్వో అయ్యప్ప
- రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమ సింగ్

ఇబ్రహీంపట్నం,విశాలభారతి:

రైతులు సాగు చేసుకుంటున్న ప్రతి ఎకరాకు రైతు భరోసా అందించనున్నట్లు రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమ సింగ్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికను ఏడి సుజాత, ఆర్డీవో అనంతరెడ్డి తో కలిసి సందర్శించి భూ రికార్డులను పరిశీలించారు. సాగు చేయని భూముల వివరాలను రైతు భరోసా నుంచి తొలగించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో టీములుగా విడిపోయి ఒకే సర్వే నెంబర్ లో ఉన్న బై నెంబర్లు గుర్తిస్తూ పకడ్బందీగా సర్వే చేపట్టాలని సూచించారు. రాళ్లు, రప్పలు, గుట్టలు చెట్లు, రైస్ మిల్, పెట్రోల్ బంకులు, ఇతర పరిశ్రమలు, లేఅవుట్ ఉన్న భూములు, రోడ్ల భూములు, భవనాలు నిర్మించుకున్న భూముల వివరాలను రైతు భరోసా నుంచి తొలగించాలని అన్నారు. 21, 23వ తేదీలలో గ్రామసభలు నిర్వహించి సాగుకు యోగ్యం కానీ భూముల వివరాలు చదివి వినిపించి వెబ్ సైట్లో పొందుపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో అయ్యప్ప, ఏవో రవినాథ్, ఆర్ఐలు, రామకృష్ణ, మురళీకృష్ణ, ఏఈవోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ఓయూ ఆర్ట్స్ కాలేజ్ వైస్ ప్రిన్సిపల్ గా కొండా నాగేశ్వర్ నియామకం

సికింద్రాబాద్ , విశాలభారతి:



ప్రతిష్టాత్మక ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గా ఆంగ్ల విభాగ ఆచార్యులు ప్రొఫెసర్ కొండా నాగేశ్వర్ నియమితులయ్యారు. ఇప్పటికే వారు పలు పరిపాలన పరమైన పదవులు విజయవంతంగా నిర్వహించారు. యూనివర్సిటీలో అతి కీలకమైన ఓయూసీఐపీకి డైరెక్టర్ గాను, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ గా, సెంటర్ ఫర్ తెలంగాణ స్టడీస్ డైరెక్టర్ గా , విజయవంతంగా తన పదవీ కాలాన్ని ముగించారు. గత సంవత్సరం ఉస్మానియా యూనివర్సిటీ సివిల్ సర్వీస్ అకాడమీకి డైరెక్టర్ బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ కొండా అనితకాలంలోనే వేలాదిమంది విద్యార్థుల ఆదరభిమానాలను చూరగున్నారు. గత 25 సంవత్సరాలుగా విద్యార్థి, అధ్యాపక ఉద్యమాలలో నాయకత్వం వహించారు. మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్, కాంపిటేటివ్ ఇంగ్లీష్ గ్రామర్ తరగతుల నిర్వహించి, వేలాదిమంది ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక కావటానికి కృషి చేశారు. ఇటీవలనే సివిల్ సర్వీస్ అకాడమీలో వెయ్యి మంది విద్యార్థులకు ఉచిత అవగాహన తరగతులు నిర్వహించారు. ఏకకాలంలో అక్డ మీక గాను, పరిపాలన పదవుల్లో రాణిస్తున్న ప్రొ. కొండా నాగేశ్వర్ ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ గా నియమిచటం పట్ల పలువురు విద్యార్థి సంఘాల నాయకులు, అధ్యాపక సంఘాలు, నాన్ టీచింగ్ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. స్వతగా మృదుభాషి అయిన ప్రొఫెసర్ కొండా విద్యార్థి, అధ్యాపకులలో రాణించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు.ఓయూ వీసీ ప్రొ. కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిసిన అనంతరం శనివారం నాడు ప్రొఫెసర్ కొండా ఆర్ట్స్ కళాశాలలో తన బాధ్యతలను స్వీకరించబోతున్నారు.



## తెలుగు సినిమాను చంపేయకండి : థమన్

నందమూరి బాలకృష్ణ ప్రధాన పాత్రలో వచ్చిన తాజా చిత్రం డాకు మహరాజ్. బాబీ ఈ సినిమాకు దర్శకత్వం వహించగా.. సితార ఎంటర్‌టైనమెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ ఈ సినిమాను నిర్మించాడు. సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం సూపర్ హిట్ అందుకున్న విషయం తెలిసిందే. వీరసింహరెడ్డి, భగవంత్ కేసరి సినిమాల తర్వాత హ్యాట్రిక్ హిట్‌ను ఖాతాలో వేసుకున్నాడు బాలయ్య. ఈ క్రమంలోనే చిత్రబృందం తాజాగా సక్సెస్ మీట్‌ను నిర్వహించింది.ఈ సక్సెస్ మీట్‌లో తెలుగు సినిమా గురించి మాట్లాడుతూ సంగీత దర్శకుడు థమన్ ఎమోషనల్ అయ్యాడు. విజయం అనేది ఎంత డబ్బు పెట్టిన దొరకదు. అది వచ్చినప్పుడు ఇచ్చే ఎనర్జీ వేరు. మనం లైఫ్‌లో చాలా ముందుకు పోవడానికి సక్సెస్ చాలా ఉపయోగపడుతుంది. సక్సెస్ లేకపోతే నేను ఫిలిం నగర్‌కి కూడా వెళ్లేవాడిని కాదు. అయితే ఒక సక్సెస్ వచ్చిందని చెప్పడానికి కూడా ఇప్పుడు నిర్మాతలకు చెప్పబుద్ది కావడం లేదు. అలా చేబితే అతడిపై నెగిటివ్‌గా ట్రోల్ చేయడం.. నెగిటివ్‌గా ట్రెండ్ చేయడం జరుగుతుంది. మీరు చేసే నెగిటివ్ ట్రోల్స్ చేయడం వలన నిర్మాతల జీవితాలు ఎఫెక్ట్ పడుతున్నాయి. నేను ఎందుకు చెబుతున్నాను అంటే ఈరోజు ప్రపంచం మొత్తం తెలుగు సినిమాను చాలా గర్వంగా చూస్తుంది. తెలుగు సినిమా ఇప్పుడు ఒక వెలుగు వెలుగుతుంది. ఇప్పుడు ఏ సినిమా ఇండస్ట్రీకి వెళ్లిన తెలుగులో ఒక సినిమా చేయాలి అని అడుగుతున్నారు. మనమే మన సినిమాని చంపేసుకుంటుంటే ఏం బ్రతుకు బ్రతుకుతున్నాం అనేది అర్థం కావాట్లేదు. విపరీతమైన ట్రోల్స్ వలన బాధగా ఉంది. ఒక సక్సెస్‌ని నిజంగా చెప్పకోలేకపోతున్నాం. ఇది ఎంత దురదృష్టకరం. మీరు పర్సనల్‌గా కొట్టుకోండి కానీ సినిమాను చంపేయకండి. నేను అదే వేడుకుంటున్నాను అంటూ థమన్ చెప్పకొచ్చాడు.






## లేడి గెటప్‌లో విశ్వక్ సేన్..

గత ఏడాది మెకానిక్ రాకీతో విజయాన్ని అందుకున్న మాస్ కా దాస్ విశ్వక్ సేన్ మరో క్రేజీ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'లైలా'. ఈ సినిమాకు దర్శకుడు రామ్ నారాయణ్ దర్శకత్వం వహిస్తుండగా.. సాహు గార్లపాటి నిర్మిస్తున్నారు. వాలెంటైన్స్ డే సందర్భంగా ఫిబ్రవరి 14న ఈ సినిమా థియేటర్లలో రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్.'మనకు తెల్లగా చేసుడే కాదు. తోలు తీసుడు కూడా వచ్చు' అంటూ టీజర్‌తోనే ఫుల్ ఎంటర్‌టైనమెంట్ ఉండబోతుందని చెప్పాడు విశ్వక్. బార్బర్ సోన్, లైలా అనే రెండు పాత్రల్లో విశ్వక్ ఇందులో కనిపించనున్నట్లు తెలుస్తుంది. ఇక మొత్తం డబుల్ మీనింగ్స్ డైలాగ్స్‌తో కట్ చేసిన ఈ టీజర్ ప్రస్తుతం వైరల్‌గా మారింది.

## టాలీవుడ్ లో మళ్లీ ఐశ్వర్య లక్ష్మి

మాలీవుడ్ బ్యూటీ ఐశ్వర్య లక్ష్మి సౌత్ ఇండస్ట్రీకి దూసుకుని వచ్చింది. తొలుత మాలీవుడ్ లో ఎంట్రీ ఇచ్చి అటుపై తమిళ్, తెలుగు సినిమాలకు ప్రమోట్ అయింది. ఆరంభంలో వరుసగా బాగానే సినిమాలు చేసింది. టాలీవుడ్ లో 'గాడ్సే'తో లాంచ్ అయింది. అటుపై 'అమ్ము' అనే మరో తెలుగు సినిమా చేసింది. ఈ రెండింటితో కేరళ అందానికి పెద్దగా ఒరిగిందేం లేదు. కోలీవుడ్ లోనే బెటర్ గా సినిమాలు చేసింది. ప్రస్తుతం అక్కడ యాక్టివ్ గా ఉంటుంది.మూడేళ్ల తర్వాత ఇటీవలే మళ్లీ 'సంబరాల ఏటి గట్టు' అనే సినిమాకి సైన్ చేసింది. ఇందులో అల్లరి నరేష్ కి జోడీగా నటిస్తోంది. ఆ రకంగా ఐశ్వర్య లక్ష్మిపేరు టాలీవుడ్ లో మళ్లీ మొదలైంది. అయితే తాజాగా అమ్మడు కోలీవుడ్ లో స్టార్ హీరో సూర్య చిత్రంలో ఛాన్స్ అందుకుంది. వెంట్రీమారన్ దర్శకత్వంలో సూర్య హీరోగా ఓసినిమా తెరకె క్కుతున్న సంగతి తెలిసిందే. ఇందులో సూర్య ద్విపాత్రాభినయం చేస్తున్నాడు. తండ్రి కొడుకు పాత్రలు తానే పోషిస్తున్నాడు. అందులో ఒకటి విలన్ పాత్ర అనే ప్రచారంలోనూ ఉంది. అయితే ఐశ్వర్య లక్ష్మి ఓ పాత్రకు పెయిర్ గా ఎంపికైంది. మరి తండ్రికి జోడీగానా ? లేక కొడుక్కి జోడీగానా? అన్నది క్లారిటీ రావాల్సి ఉంది. తమిళనాడు సంప్రదాయ క్రీడ జల్లికట్టు నేపథ్యంలో తెరకెక్కిస్తున్న చిత్రమిది. ఇందులో సూర్య ఊర మాస్ పాత్రలో కనిపించనున్నాడు. కుమారుడి రోల్ కూడా అంతే మాసివ్ గా ఉంటుందని సమాచారం. ఈ నేపథ్యంలో హీరోయిన్ గా పలువురు భామలను పరిశీలించి నప్పటికీ చివరిగా ఐశ్వర్య లక్ష్మిని లుక్ టెస్ట్ చేసి ఎంపిక చేసినట్లు కోలీవుడ్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. వెట్రీ మారన్ చిత్రంలో హీరోయిన్ అవకాశం అంటే అంత వీజీ కాదు. చాలా టెస్టులు పాస్ అవ్వాల్సి ఉంటుంది. అన్ని పర్ఫెక్ట్ గా కుదిరితేనే వెట్రీమారన్ ఎంపిక చేస్తాడు. ఆ రకంగా అమ్మడు అన్నింటి ప్రూవ్ చేసుకుంది. త్వరలోనే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుంది. కలై పులి ఎస్ థాను ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



## అట్టర్ ఫ్లాప్ టాక్..

బాలీవుడ్ ఫైర్ బ్రాండ్ బీజేపీ ఎంపీ కంగన రనౌత్ స్వీయ దర్శకత్వంలో వచ్చిన మోస్ట్ ప్రెస్టిజీయస్ మూవీ ఎమర్జెన్సీ(Emergency). దివంగత భారత ప్రధాని ఇందిరాగాంధీ జీవిత చరిత్ర ఆధారంగా రూపొందింది. ఎన్నో వివాదాల వలన వాయిదా పడుతూ వస్తున్న ఈ చిత్రం ఎట్టకేలకు నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అధికార పార్టీ ప్రాపగాండా(BJP Propaganda Movies) మూవీగా వచ్చిన ఈ చిత్రం ఫస్ట్ షో నుంచే ఫ్లాప్ టాక్ తెచ్చుకుంది. కొందరూ ఈ సినిమాను యావరేజ్ అంటూ రివ్యూలు ఇస్తుండగా.. మరికొంతమంది మాత్రం ఫ్లాప్ అంటూ చెబుతున్నారు. ఈ క్రమంలోనే ఒక మూవీ ప్రేక్షకుడు ఇచ్చిన రివ్యూ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.ఈ సినిమా ఎలా ఉంది అని మీడియా ప్రశ్నించగా.. ప్రేక్షకుడు మాట్లాడుతూ.. ఈ సినిమా చూసిన అనంతరం నాకు ఎమర్జెన్సీ వచ్చిందని అంబులెన్స్‌కి కాల్ చేసి ఇంటికి వెళదాం అనుకున్నాను. బీజేపీ ఇలాంటి పొలిటికల్ సినిమాలు ఎందుకు తీస్తుందో అర్థం కావాట్లేదు. మోడీ సినిమాని వివేక్ ఒబేరాయ్ తీస్తే ఆ సినిమా అట్టర్ ఫ్లాప్ అయ్యింది. ఇప్పుడు ఇందిరా గాంధీ లైఫ్ స్టోరీ ఆధారంగా ఈ సినిమా తీశారు. ఇందిరా లాంటి స్ట్రాంగ్ వుమెన్ పాత్రలో నటించాలి అనుకున్నప్పుడు కొంచెం అయిన వర్క్ చేయాల్సింది. కానీ కంగనా అసలు అలా కనిపించలేదు. ఈ సినిమాలో కంగనా నటించలేదు మిమిక్రీ చేసింది. ఇందిరా గాంధీ పాత్రలో కంటే కంగనా మిమిక్రీ ఆర్టిస్ట్‌గా బాగా సెట్ అయ్యింది.అనుపమ్ ఖేర్‌కి ఈ మధ్య ఏం అయ్యిందో తెలియట్లేదు. ప్రతి బీజేపీ ప్రాపగాండా సినిమాలో నటిస్తున్నాడు. పాత అనుపమ్ ఖేర్ మళ్లీ కనిపించడు ఏమో. శ్రేయాస్ తల్పడే కూడా వాజ్‌పేయ్ పాత్రలో సెట్ అవ్వలేదు. ఏం చెబుతాం అనుకొని ఈ సినిమా తీశారో అర్థం కాదు. బయోగ్రఫీలో మిర్చి మసాలా జోడించినట్లు ఉంది అంటూ అభిమాని చెప్పుకోచ్చాడు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.